E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం




ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు » 3లో

హైదరాబాద్ (తేదీ) 15-02-2026 (వారం) ఆదివారం సంపుటి: 02 || సంచిక:45 || పేజీలు–6 www.ekaburu.com

## మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలి: సీఎం రేవంత్

**ఈ కబురు, హైదరాబాద్:**
మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నేతలతో సమావేశమయ్యారు. మంచి ఫలితాలు సాధించారని మంత్రులు, సీనియర్ నేతలను అభినందించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమ పథకాలపై నమ్మకాన్ని కల్పించామన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మరింత ముందుకెళ్లాలన్నారు. సంక్షేమ, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలని దిశానిర్దేశం చేశారు. వాటి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. తరువాయి 2లో



## చైనా సరిహద్దులో ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ ..హైవేపై దిగిన మోదీ విమానం

ఈ కబురు : అస్సాంలో చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. ఈశాన్య భారతంలో ఏర్పాటైన తొలి ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ (ELF)పై ప్రధాని మోదీ ప్రయాణిస్తున్న ఎయిర్‌క్రాఫ్ట్ (C130J) ల్యాండ్ అయింది. ఈ ఫెసిలిటీ చైనా సరిహద్దుకు 300 కి.మీ దూరంలో ఉంది. ప్రధాని మోదీ దీన్ని నేడు ప్రారంభించారు. ఈ సందర్భంగా వాయుసేన ప్రత్యేక విన్యాసాలు ప్రదర్శించింది. ఈ ఫెసిలిటీ గురించి మోదీ ఇప్పటికే ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. క్లిష్ట సమయంలో సహాయ కార్యకలాపాలకు, అత్యవసర ప్రతిస్పందనకు ఈ ఈఎల్ఎఫ్ కీలకమని పేర్కొన్నారు.




తరువాయి 2లో




### తెలంగాణ నేలకు పాదాభివందనం: పవన్ కల్యాణ్

ఈ కబురు : తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై జనసేన పార్టీ అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్(Pawan Kalyan) స్పందించారు. ఈ మేరకు శనివారం సాయంత్రం సోషల్ మీడియా వేదికగా ప్రకటన విడుదల చేశారు. '




### మిగిలిన మావోయిస్ట్‌లు లొంగిపోవాలని డీజీపీ శివధర్ రెడ్డి పిలుపు

ఈ కబురు, తెలంగాణ : అజ్ఞాతంలో కొనసాగుతున్న సీపీఐ (మావోయిస్టు) నాయకులు, కార్యకర్తలు సమాజంలోని ప్రధాన స్రవంతిలోకి తిరిగి వచ్చి శాంతియుత, గౌరవప్రదమైన జీవితం గడపాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు.




### అవాస్తవాలను ప్రచారం చేయడమే రాహుల్ సిద్ధాంతం: అమిత్ షా

ఈ కబురు : అవాస్తవాలను ప్రచారం చేయడమే ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సిద్ధాంతమని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆరోపించారు. అమెరికాతో కుదుర్చుకున్న ట్రేడ్ డీల్‌పై తప్పుడు ఆరోపణలు చేయడాన్ని ఖండించారు.

## రూ.3.32 లక్షల కోట్ల బడ్జెట్



- ఏపీ ప్రభుత్వం భారీ అంచనాలతో 2026-–27 వార్షిక బడ్జెట్
- అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి పయ్యావుల
- అభివృద్ధి సంక్షేమంతో రాష్ట్రం పరుగులు
- మంత్రి వ్యాఖ్యలు, కొత్త వరాలు, కేటాయింపుల తో బడ్జెట్ ప్రతిపాదన
- స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంతో బడ్జెట్ ప్రతిపాదనలు
- రాయలసీమ రైతుల కలలు సహకారం
- కీలక రంగాలకు బడ్జెట్లో భారీ కేటాయింపులు

ఈ కబురు ; ఏపీ ప్రభుత్వం భారీ అంచనాలతో 202627 వార్షిక బడ్జెట్ ను అసెంబ్లీలో ప్రవేశ పెట్టింది. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ప్రసంగంలో గత ప్రభుత్వం లో సాగిన పాలన పైన విమర్శలు చేసారు. రాష్ట్ర విభజన ఒక నష్టం అయితే, ఆ తరువాత అయిదేళ్ల పాలన రాష్ట్రానికి నష్టం చేసిందని ఆరోపించారు. ఈ బడ్జెట్ కేవలం పద్దులే కాదని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉంటుందని వెల్లడించారు. అభివృద్ధి సంక్షేమంతో రాష్ట్రాన్ని పరుగులు పెట్టించాలనేదే తమ విధానమని స్పష్టం చేసారు.రాష్ట్ర బడ్జెట్ 202627 ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అసెంబ్లీలో ప్రవేశ పెట్టారు. రానున్న ఆర్థిక సంవత్సరానికి 3,32,205 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రతిపాదించారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యం తో ఈ బడ్జెట్ ప్రతిపాదించినట్లు వెల్లడించారు. రాయలసీమ రైతుల కలలను సాకారం చేసేలా ప్రాధాన్యత ఇచ్చామన్నారు. పెట్టుబడి దారులకు అనుకూల వాతావరణం కల్పించామని ఆర్థిక మంత్రి వివరించారు. కీలక రంగాలకు కేటాయింపులు భారీగా పెంచారు. రెవెన్యూ వ్యయం 2,56,143 కోట్లు కాగా, మూలధన వ్యయం 53,915 కోట్లు గా పేర్కొన్నారు

తరువాయి 2లో




## పర్యావరణ పరిరక్షణ దిశగా తెలంగాణ ఆర్టీసీ అడుగులు

### .. దేశంలోనే మొదటి రాష్ట్రంగా సరికొత్త రికార్డ్!

ఈ కబురు ; కాలుష్యరహిత ప్రజా రవాణా వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సరికొత్త వ్యూహంతో ముందుకు సాగుతోంది. పాత డీజిల్ బస్సులను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చే 'రెట్రో ఫిట్మెంట్ సాంకేతికతపై సంస్థ దృష్టి సారించింది. గతేడాది సెప్టెంబర్ 15న 'రెట్రో ఫిట్మెంట్' కోసం టెండర్లు పిలువగా అదే నెల 30న టెండర్ ప్రక్రియ ముగిసింది. సాయి గ్రీన్ మొబిలిటీ సంస్థకు 200, కల్యాణి పవర్ ట్రైన్ లిమిటెడ్ కు 40 బస్సు లను 'రెట్రో ఫిట్మెంట్' చేసే బాధ్యతను ఆర్టీసీ అప్పగించింది. 2027 నాటికి హైదరాబాద్ ఓఆర్ ఆర్ లోపల 2800 ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టాలనే లక్ష్యంతో సంస్థ ముందుకు సాగుతోంది. తరువాయి 2లో

## ఇది కేవలం ట్రైలర్ మాత్రమే

- అసలు సినిమా ముందుంది'.
- కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు



....(2లో)

## హంగ్ మున్సిపాలిటీలపై నజర్



....(2లో)

## త్వరలో ఇరాన్ పాలనలో మార్పులు జరిగే అవకాశం: ట్రంప్

ఈ కబురు : అమెరికాఇరాన్ మధ్య కొనసాగుతోన్న ఉద్రిక్తతల నేపథ్యంలో యూఎస్ సైన్యం ఇప్పటికే ఇరాన్‌ను చుట్టుముట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌పై సైనిక చర్య అంశాన్ని పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. ఆ దేశంలోని పాలనలో మార్పు జరగడం వల్లే అక్కడి పరిస్థితులు చక్కదిద్దుకుంటాయని.. అదే ఉత్తమ మార్గమని అభిప్రాయపడ్డారు. త్వరలోనే అదికూడా జరిగే అవకాశం ఉన్నట్లు తెలిపారు. 47 ఏళ్లుగా చర్చల పేరుతో వారు మాట్లాడుతూనే ఉన్నారని.. ఈలోగా ఎంతో మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారని ట్రంప్ అన్నారు. ఇకపై ఈ విషయంలో ఆలస్యం చేయదలుచుకోలేదని పేర్కొన్నారు. అయితే నూతన పాలకులను ఇరాన్ ప్రజలే ఎన్నుకుంటారన్నారు. అణు ఒప్పందంపై ప్రస్తుతం ఇరాన్‌తో జరుగుతోన్న చర్చలు విజయవంతమవుతాయని తాను భావిస్తున్నానని..



తరువాయి 2లో



## ఈ ఫలితాల ప్రభావం అసెంబ్లీ ఎన్నికలపై ఉండదు: కేటీఆర్

ఈ కబురు, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల ప్రభావం అసెంబ్లీ ఎన్నికలపై ఉండదని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ (KTR) అన్నారు. మున్సిపల్ పీఠాలకు సంబంధించి ఎక్స్ అఫీషియో ఓట్ల నమోదుపై సీఎస్, ఎస్ఈసీను కేటీఆర్, ఆ పార్టీ నేతలు కలిశారు. అనంతరం మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. 30కిపైగా మున్సిపాలిటీలు గెలుస్తామని అనుకున్నాం..

తరువాయి 2లో

## వాలెంటైన్స్ డే సాక్షిగా వారిది 'అక్రమ సంబంధం' .. బండి సంజయ్ షాకింగ్ కామెంట్స్!

ఈ కబురు ; కేంద్రమంత్రి బండి సంజయ్ వాలెంటైన్స్ డే సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ , ఎంఐఎం పార్టీలపై తనదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. ఈ మూడు పార్టీల మధ్య ఉన్నది పవిత్ర బంధం కాదు.. 'అక్రమ సంబంధం' అంటూ తీవ్ర విమర్శలు చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఈ పార్టీలు లోపాయకారి ఒప్పందాలు చేసుకుంటున్నాయని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలకు వాలెంటైన్స్ డే శుభాకాంక్షలు చెబుతూనే..



....(2లో)

## ఫార్ములా ఈ-కార్ రేస్ కేసులో కీలక పరిణామం

**ఈ కబురు, హైదరాబాద్:**
ఫార్ములా ఈకార్ రేస్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్ ప్రాసిక్యూషన్‌కు కేంద్రం అనుమతి ఇచ్చింది. మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గతంలోనే గవర్నర్ అనుమతి ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈకార్ రేస్ కేసులో త్వరలో ఏసీబీ ఛార్జిషీట్ దాఖలు చేయనుంది. హైదరాబాద్‌లో 2023లో నిర్వహించిన ఫార్ములాఈ రేస్ కోసం విదేశీ సంస్థకు నిబంధనలకు విరుద్ధంగా సొమ్ము చెల్లించడం వల్ల ప్రభుత్వానికి రూ.54.88 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ఏసీబీ ఇప్పటికే కేసు నమోదు చేసింది.



తరువాయి 3లో

## పాక్ సరిహద్దుల్లో రూ.40 కోట్ల విలువ గల డ్రగ్స్.. .. డ్రోన్‌తో జారవిడిచినట్లు అనుమానాలు

ఈ కబురు : జమ్మూకశ్మీర్‌లోని అంతర్జాతీయ సరిహద్దు వెంబడి భారీగా మాదక ద్రవ్యాలు లభించడం కలకలం సృష్టిస్తోంది. పాకిస్థాన్ నుంచి వచ్చిన డ్రోన్ వీటిని జారవిడిచినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఆర్ఎస్ పురా సెక్టార్‌లో 6.5 కిలోలకు పైగా హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం అర్ధరాత్రి అనుమానిత డ్రోన్ కదలికలను స్థానికులు గుర్తించారు.



....(2లో)

# రూ.3.32 లక్షల కోట్ల బడ్జెట్




రెవెన్యూ లోటు 22,002 కోట్లు,ద్రవ్య లోటు 75,868 కోట్లు గా అంచనాల్లో వెల్లడించారు. ఇక, శాఖల వారీగా వ్యవసాయ శాఖ కు 11,745 కోట్లు, పాఠశాల విద్య కు 32, 208, బీసీ సంక్షేమం ర23650 కోట్లు, ఇంధన శాఖ 19,306 కోట్లు, పంచాయితీ రాజ్ కు 22,941 కోట్లు, ఇరిగేషన్ 18,223 కోట్ల మేర కేటాయింపులు ప్రతిపాదించారు. అన్నదాత సుఖీభవ కోసం 6,600 కోట్లు, మత్స్యకార సేవకు 600 కోట్లు, ధరల స్థిరీకరణ కు 560 కోట్లు కేటాయింపులు చేసారు.విద్య, వైద్యం, మౌలిక వసతులకు బడ్జెట్ కేటాయింపుల్లో ప్రాధాన్యత ఇచ్చారు. తల్లికి వందనం కోసం 9,600 కోట్లు ప్రతిపాదించారు. విద్యా మిత్ర కోసం 654 కోట్లు కేటాయించారు. పోలవరం కోసం 6,105 కోట్లు ప్రతిపాదన చేసారు. మున్సిపల్ శాఖకు 14,358 కోట్లు, ఈ డబ్ల్యూ ఎస్ సంక్షేమం కోసం 10,699 కోట్లు అమరావతి కోసం ఆరు వేల కోట్లు, ఉన్నత విద్య కోసం 2,566 కోట్లు, మహిళా శిశు సంక్షేమం కోసం 4,581 కోట్లు ప్రతిపాదించారు. మన బడి మన భవిష్యత్ కోసం 155 కోట్లు ప్రతిపాదించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకానికి 2,161 కోట్లు కేటాయించారు. స్కిల్ డెవలప్ మెంట్ కోసం 1,232 కోట్లు, సాంఘిక సంక్షేమ శాఖకు 11, 118 కోట్లు, స్కాలర్ షిప్ కోసం 3,836 కోట్లు ప్రతిపాదించారు. 30 వేల కోట్లతో హార్టీకల్చర్ క్లస్టర్లు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.202627 పద్దును ప్రవేశపెట్టిన మంత్రి పయ్యావుల. వరుసగా మూడో సారి బడ్జెట్ ప్రవేశపెట్టారు.

202627 వార్షిక బడ్జెట్ కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం బడ్జెట్ ప్రతులను సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కు ఆర్థిక మంత్రి పయ్యావుల అందజేశారు. అంతకుముందు మంత్రి పయ్యావుల రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో రాష్ట్ర ఆర్థిక శాఖ అధికారులతో విజయవాడలోని కనకదుర్గమ్మను దర్శించుకున్నారు.

**——రైతులకు ఆర్థిక తోడ్పాటు.. 53,752 కోట్లతో వ్యవసాయ బడ్జెట్..**

ఏపీ ప్రభుత్వం రైతులకు ఆర్థికంగా తోడ్పాటు అందిస్తామని ప్రకటించింది. ప్రతీ రైతుకు మద్దతుగా నిలుస్తామని హామీ ఇచ్చింది. 202627 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వ్యవసాయ బడ్జెట్‌ను మంత్రి అచ్చెన్నాయుడు అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. వ్యవసాయం లాభసాటిగా మారితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని, దాని ద్వారానే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని వివరించారు. ఏపీ వ్యవసాయ బడ్జెట్ 53,752 కోట్లు గా మంత్రి ప్రతిపాదించారు. రైతు సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలను వివరించారు.ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సాధారణ బడ్జెట్ ను ప్రతిపాదించిన తరువాత అచ్చెన్నాయుడు వ్యవసాయ అనుబంధ రంగాల కేటాయింపులను వివరించారు. అందులో భాగంగా ధాన్యం సేకరణకు సంబంధించి 1,674 కోట్ల బకాయిలు చెల్లింపు చేసినట్లు వెల్లడించారు. పెట్టుబడి రాయితీ కింద 310 కోట్లు, వ్యవసాయ యాంత్రీకరణలో 50 శాతం రాయితీతో 136 కోట్లు, భూసారాన్ని అంచనా వేయడానికి 6 లక్షల భూసార పరీక్ష పత్రాల అందజేస్తున్నామని వివరించారు.పొలం పిలుస్తోంది' కార్యక్రమంతో 18 లక్షల మంది రైతులకు విస్తరణ సేవలు అందిస్తున్నారు. 80 శాతం రాయితీ కింద 90.4 కోట్లతో 1,130 డ్రోన్ కేంద్రాలు, గతేడాది 182 కోట్ల రాయితీతో విత్తనాల సరఫరా, పంటలను కాపాడేందుకు రైతులకు అన్నివిధాలుగా సాయం చేస్తామని ప్రకటించారు. సాగునీటి సౌకర్యాల కల్పనకు బిందు సేద్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు.వ్యవసాయ రంగం వృద్ధి రేటు 7.83 శాతం గా మంత్రి అచ్చెన్నాయుడు వివరించారు. పీఎం కిసాన్ పథకం కింద 6,309 కోట్లు చెల్లింపులు చేసినట్లు వెల్లడించారు. 202627లో 6,600 కోట్లు పీఎం కిసాన్ కోసం కేటాయించగా,ఇప్పుడు కొంత మేర పెంచారు. రాష్ట్ర ఆర్థిక రంగానికి మూల స్తంభంగా వ్యవసాయం నిలిచిందన్నారు. దేశ వ్యవసాయ రంగంలో ఆంధ్రప్రదేశ్ వాటా 10 శాతం గా చెప్పారు. 11 వ్యవసాయ పంటలను గ్రోత్ ఇంజిన్లుగా గుర్తించామని,24 గంటల్లో 9వేల కోట్లకు పైగా రైతుల ఖాతాల్లో జమ చేసామని వివరించారు. వ్యవసాయం లాభసాటిగా మారితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు.గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉంటేనే రాష్ట్రం ఆర్థికంగా సుభిక్షం సాధ్యం అవుతుందని మంత్రి అచ్చయ్య నాయుడు చెప్పారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగు, అగ్రి టెక్నాలజీ, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభంగా వ్యవసాయ రంగాన్ని గుర్తించామన్నారు. వ్యవసాయ రంగం వృద్ధి రేటు 7.83 శాతం సాధించిందని తెలిపారు. పంటలను కాపాడేందుకు రైతులకు అన్ని విధాలుగా సాయం అందిస్తామని తెలిపారు. 80 శాతం రాయితీతో 90.4 కోట్లతో,1,130 డ్రోన్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. గతేడాది 182 కోట్ల రాయితీతో విత్తనాల సరఫరా చేశామని మంత్రి పేర్కొన్నారు.

### పర్యావరణ పరిరక్షణ దిశగా

## తెలంగాణ ఆర్టీసీ అడుగులు




**——325 ఎలక్ట్రిక్ బస్సులు**

వ్యక్తిగత వాహనాల వినియోగం తగ్గి ప్రజా రవాణా పెరగడంతో కాలుష్యం తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. శ్వాసకోశ, గుండె సంబంధిత వ్యాధులు తగ్గి ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని భావిస్తున్నారు. అందులో భాగంగా హైదరాబాద్ లోని ఆరు డిపోల పరిధిలో 325 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తుండగా, ఈ ఏడాదిలో మరో 175 బస్సులు అందుబాటులోకి రానున్నాయి. రాబోయే బస్సుల కోసం అదనంగా 19 డిపోలలో చార్జింగ్ సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నారు. కొత్తగా 10 డిపోలు, 10 చార్జింగ్ కేంద్రాలు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ మౌలిక సదుపాయాల కోసం సుమారు రూ. 392 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. 2023లోనే ముషీరాబాద్ డిపోకు చెందిన ఒక డీజిల్ బస్సును ప్రైవేటు సంస్థ సహకారంతో ఎలక్ట్రిక్ బస్సుగా మార్చారు. ప్రస్తుతం ఈ బస్సు ఉప్పల్ డిపో పరిధిలో విజయవంతంఅయింది.

--ప్రజలు ఆదరించాలి.. ఆర్టీసీ వీసీ,ఎండీ వై.నాగిరెడ్డి

హైదరాబాద్ భవిష్యత్తు కోసం తీసుకొస్తున్న ఈ హరిత ప్రయాణాన్ని ప్రజలంతా ఆదరించాలి. నగర ప్రజా రవాణా రూపురేఖలను మార్చే ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు, కాలుష్యరహిత రవాణా సేవలు అందించేందుకు ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వ ఆదేశాలతో తీసుకొస్తున్నాం.

## పాక్ సరిహద్దుల్లో రూ.40 కోట్ల విలువ గల డ్రగ్స్.. ..డ్రోన్‌తో జారవిడిచినట్లు అనుమానాలు

ఆ డ్రోన్ ఏదో పదార్థాన్ని జారవిడిచినట్లు గుర్తించి.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు, బీఎస్ఎఫ్ దళాలతో కలిసి ఆ ప్రాంతంలో తనిఖీలు చేశారు. స్థానిక పొలాల్లో పెద్దఎత్తున హెరాయిన్‌ను గుర్తించారు. దాని మొత్తం విలువ రూ.40 కోట్లకు పైగా ఉంటుందని భావిస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఇదిలాఉండగా.. కథువా జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో డ్రోన్‌ల ద్వారా పాక్ నుంచి హెరాయిన్‌ను అక్రమంగా తరలిస్తున్నారనే ఆరోపణలపై ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిని పంజాబ్‌లోని పఠాన్‌కోట్‌కు చెందిన జతిన్, కథువాలోని జఖ్‌బార్‌కు చెందిన డానిష్ డోగ్రాలుగా గుర్తించారు. వీరికి పాకిస్థాన్‌కు చెందిన స్మగ్లర్‌లతో సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది.

## పది నెలల చిన్నారి.. ఐదుగురికి ప్రాణదాత

ఈ కబురు : కుటుంబ సభ్యులతో వెళ్తున్న ఓ పది నెలల చిన్నారి.. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను వైద్యులు బ్రెయిన్ డెడ్‌గా ప్రకటించారు. దీంతో కీలక నిర్ణయం తీసుకున్న చిన్నారి తల్లిదండ్రులు.. అవయవదానానికి ముందుకొచ్చారు. దీంతో ఏడాది నిండని ఆ చిన్నారి ఐదుగురికి ప్రాణదాతగా నిలవడమే కాకుండా రాష్ట్రంలో అవయవదానం చేసిన అతిపిన్న వయస్కురాలిగా నిలిచింది. కేరళలోని కొట్టాయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పథనంతిట్టకు చెందిన అరుణ్ అబ్రహం, షెరిన్ ఆన్ దంపతుల కుమార్తె అలిన్ షెరిన్.. వయసు పది నెలలు. ఫిబ్రవరి 5న తల్లి, ఇతర కుటుంబ సభ్యులతో కారులో వెళ్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో చిన్నారి తలకు తీవ్ర గాయాలవడంతో స్థానిక ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో ప్రత్యేక చికిత్స కోసం మరో ఆసుపత్రికి తరలించారు. అక్కడ బ్రెయిన్ డెడ్‌గా వైద్యులు నిర్ధరించారు. దీంతో చిన్నారి తల్లిదండ్రులు అవయవాలను దానం చేయాలని నిర్ణయించుకున్నారు. ఇలాంటి విషాద సమయంలో తల్లిదండ్రులు తీసుకున్న నిర్ణయం ఎంతో మంది హృదయాలను కదిలించింది. ఈ చర్యను రాష్ట్ర గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్, ముఖ్యమంత్రి పినరయి విజయన్, నటుడు మోహన్‌లాల్ సహా అనేక మంది ప్రశంసించారు. తీవ్ర దుఃఖంలోనూ అసాధారణ నిర్ణయం తీసుకొని ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచారన్నారు. ఫిబ్రవరి 15న చిన్నారి అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించాలని ముఖ్యమంత్రి



## ఇది కేవలం ట్రైలర్ మాత్రమే



ఈ కబురు ; తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (AIFB) స్టేట్ కన్వీనర్ అంబటి జోజిరెడ్డి , హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ బంజారాహిల్స్‌లోని జాగృతి కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో కీలక వ్యాఖ్యలు చేశారు. ఇటీవలి మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై స్పందిస్తూ.. ఇది కేవలం 'ట్రైలర్' మాత్రమే.. అసలు 'సినిమా' ముందుందని వారు ప్రకటించారు. మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ జాగృతి, ఫార్వర్డ్ బ్లాక్ కూటమి 40 స్థానాల్లో విజయం సాధించిందని కవిత తెలిపారు. ప్రజలు కొత్త రకమైన రాజకీయాలను కోరుకుంటున్నారని.. ప్రత్యామ్నాయం లేకే కాంగ్రెస్‌కు ఓటు వేశారని ఆమె అభిప్రాయపడ్డారు. గతంలో 90 శాతం మున్సిపాలిటీలను గెలుచుకున్న బీఆర్ఎస్.. ఇప్పుడు కేవలం 16 స్థానాలకే పరిమితం కావడం ఆ పార్టీ పతనానికి నిదర్శనమని.. ప్రజల ప్రేమను ఎందుకు కోల్పోయారో బీఆర్ఎస్ సమీక్షించుకోవాలని హితవు పలికారు. మున్సిపల్ ఎన్నికలు బీజేపీబీఆర్ఎస్ మధ్య లోపాయికారీ పొత్తుకు తొలిమెట్టు అని కవిత ఆరోపించారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్ నేతలు బీజేపీ గెలుపునకు సహకరించారని ఆమె విమర్శించారు. కాంగ్రెస్‌తో చేతులు కలిపిన సీపీఐకి, బీఆర్ఎస్ బేషరతుగా మద్దతు ప్రకటించడం నయవంచన అని.. కాళేశ్వరం ప్రాజెక్టుపై గతంలో సీపీఐ చేసిన ఆరోపణలను ఇప్పుడు బీఆర్ఎస్ అంగీకరిస్తున్నట్లేనా అని ప్రశ్నించారు. త్వరలోనే తెలంగాణ జాగృతి పూర్తిస్థాయి రాజకీయ పార్టీగా మారుతుందని.. యువతకు, ఉద్యమకారులకు అండగా నిలుస్తుందని నాయకులు స్పష్టం చేశారు. సింగరేణి ఎన్నికల్లో హెచ్ఎంఎస్, జాగృతి కలిసి పనిచేస్తాయని, కార్మికుల హక్కుల కోసం పోరాడుతామని రియాజ్ అహ్మద్ తెలిపారు. అధికార పార్టీ కాంగ్రెస్ ప్రలోభాలకు గురిచేస్తున్నా తమ అభ్యర్థులు లొంగలేదని.. వడ్డేపల్లి వంటి చోట్ల స్పష్టమైన తీర్పు వచ్చిందని అంబటి జోజిరెడ్డి పేర్కొన్నారు. ప్రజా సమస్యలే అజెండాగా, సుభాషిజం సిద్ధాంతంతో ముందుకు సాగుతామని వారు వెల్లడించారు.

## త్వరలో ఇరాన్ పాలనలో మార్పులు జరిగే అవకాశం: ట్రంప్



కానీ అవి విఫలమైన రోజు ఇరాన్ చరిత్రలో ఓ చెడు రోజుగా నిలిచిపోతుందని ట్రంప్ పేర్కొన్నారు. టెహ్రాన్‌తో చర్చలు కొనసాగించాలని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు సూచించినట్లు తెలిపారు. అగ్రరాజ్యానికి చెందిన యుద్ధ విమాన వాహక నౌకలు ఇరాన్ వైపు తరలివస్తున్న సమయంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడంతో.. ఏ క్షణాన ఏం జరగుతుందోనని పశ్చిమాసియా దేశాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి.

--ఆందోళనలు కొనసాగించండి: యువరాజు రెజా పహ్లావి

ఇరాన్‌లో నిరసనలు మరింత తీవ్రం చేయాలని ప్రవాసంలో తలదాచుకున్న ఆ దేశ యువరాజు రెజా పహ్లావి ప్రజలకు పిలుపునిచ్చారు. నిరసనకారులపై ఇటీవల ప్రభుత్వం చేపట్టిన అణచివేత చర్యలకు వ్యతిరేకంగా ప్రజలంతా వీధుల్లోకి వచ్చి.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయాలన్నారు. ఇరాన్ ప్రజలకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సహా ప్రపంచ దేశాలు అండగా ఉంటాయని పేర్కొన్నారు.

### మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను

## దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలి: సీఎం రేవంత్



**——రేవంత్‌రెడ్డితో సీపీఐ నేత పల్లా వెంకట్‌రెడ్డి భేటీ**

సీఎం రేవంత్‌రెడ్డితో సీపీఐ నేత పల్లా వెంకట్‌రెడ్డి సమావేశమయ్యారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు, తాజా పరిణామాలు, కొత్తగూడెం కార్పొరేషన్ గురించి చర్చించారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో కాంగ్రెస్ కూటమి (కాంగ్రెస్22, సీపీఎం1) 23 డివిజన్లలో విజయం సాధించింది. సీపీఐకి 22, బీఆర్ఎస్8, భాజపా1, స్వతంత్రులు 6 డివిజన్లలో గెలుపొందారు. స్వతంత్రుల్లో ఒకరు సీపీఐ నాయకుడు కావటంతో ఆ పార్టీ బలం కూడా 23కు చేరింది. మిగిలిన ఐదుగురు స్వతంత్రుల్లో ముగ్గురు, బీఆర్ఎస్ నుంచి గెలిచిన వారిలో ముగ్గురు హస్తం గూటికి చేరటంతో కాంగ్రెస్ కూటమి బలం 29కు పెరిగింది. మేయర్ ఎన్నిక సమయంలో కాంగ్రెస్, సీపీఐ కలిసి నడుస్తాయా.. లేదా విడివిడిగా ప్రయత్నిస్తాయా అనే అంశంపై ఆసక్తి నెలకొంది.

## చైనా సరిహద్దులో ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ ..హైవేపై దిగిన మోదీ విమానం

ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో దిబ్రూగఢ్ ఎయిర్‌పోర్ట్, చబువా ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లలో కార్యకలాపాలు నిర్వహించలేని పరిస్థితి ఉంటే.. ఈ ఈఎల్ఎఫ్‌ను ఒక ప్రత్యామ్నాయంగా వాడతారు. దాంతో సరిహద్దు ప్రాంతాల్లో ఉద్రిక్తతలు చోటుచేసుకున్నప్పుడు.. భారత వాయుసేన వేగంగా స్పందించేందుకు వీలవుతుంది. టేకాఫ్, ల్యాండింగ్‌కు అనుకూలంగా దీనిని డిజైన్ చేశారు. పశ్చిమ, ఉత్తర, మధ్య భారతంలో ఇప్పటికే ఈ ఈఎల్ఎఫ్‌లు ఉన్నాయి. చైనాతో సరిహద్దు వివాదాల వేళ ఈశాన్య భారతంలో దీన్ని ఏర్పాటు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.





## ఈ ఫలితాల ప్రభావం అసెంబ్లీ ఎన్నికలపై ఉండదు: కేటీఆర్



కానీ, కొంత తగ్గిందన్నారు. హంగ్ వచ్చిన చోట్ల కూడా తమకు అనుకూలంగా ఉంటుందని చెప్పారు. ''కాంగ్రెస్ పార్టీకి కూడా ఆశించిన మేర మున్సిపాలిటీలు రాలేదు. కరీంనగర్, నిజామాబాద్ మినహాయిస్తే భాజపా ప్రభావం ఎక్కడా లేదు. స్థానికంగా జరిగిన ఎన్నికలు కాబట్టి అక్కడి పరిస్థితులను బట్టే పొత్తులు ఉంటాయి. వాటి ప్రభావం అసెంబ్లీ ఎన్నికలపై ఉండదు. సింగరేణి కార్మికులకు అండగా ఉంటామన్న సందేశం ఇచ్చే ఆలోచనతోనే కొత్తగూడెంలో సీపీఐకి మద్దతు ఇస్తున్నాం''అని కేటీఆర్ చెప్పారు.

## వాలెంటైన్స్ డే సాక్షిగా వారిది 'అక్రమ సంబంధం'



వారి మధ్య ఉన్న బంధాన్ని ప్రజల ముందు ఉంచారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో కాంగ్రెస్‌బీఆర్ఎస్ బంధాన్ని 'ఫెవికాల్ బంధం' అని అభివర్ణించారని గుర్తు చేస్తూ.. ఇది ప్రజలను మోసం చేసే 'ఎంజీ ' బంధమని బండి సంజయ్ ఎద్దేవా చేశారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో బీజేపీకి మేయర్ పీఠం దక్కకుండా చేసేందుకు ఈ మూడు పార్టీలు ఏకమయ్యాయని ఆయన ఆరోపించారు. బీజేపీ ఎదుగుదలను అడ్డుకోవడమే లక్ష్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కుట్రలు చేస్తున్నాయని.. కానీ కరీంనగర్ ప్రజలు , బీజేపీ కార్యకర్తల ఐక్యత ముందు ఈ తప్పుడు ఎత్తుగడలు సాగవని హెచ్చరించారు. 'వీరి ప్రేమ, వీరి అక్రమ బంధం ప్రజల చిత్కారాలతో, ఛీత్కారాలతో నిండు నూరేళ్లు ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నాను' అని బండి సంజయ్ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. క్షేత్రస్థాయిలో ప్రజలు వీరి నాటకాలను గమనిస్తున్నారని.. రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెబుతారని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీని రాజకీయంగా దెబ్బతీయడానికి సిద్ధాంతాలు పక్కన పెట్టి మరీ ఈ పార్టీలు కలిశాయని.. కరీంనగర్ వేదికగా వారి అక్రమ సంబంధం బయటపడిందని ఆయన పేర్కొన్నారు. మొత్తానికి.. ప్రేమ దినోత్సవం రోజున రాజకీయ ప్రత్యర్థులపై బండి సంజయ్ చేసిన ఈ 'ఘాటు' వ్యాఖ్యలు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.

## హంగ్ మున్సిపాలిటీలపై నజర్



**.. మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ!**

ఈ కబురు , హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో హంగ్ ఏర్పడిన మున్సిపాలిటీల్లో స్వతంత్ర అభ్యర్థులే కీలకంగా మారనున్నారు. మ్యాజిక్ ఫిగర్ దాటని మున్సిపాలిటీలను హస్తగతం చేసుకునేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ కసరత్తు ముమ్మరం చేసింది. ఈ క్రమంలోనే జూబ్లీహిల్స్‌లోని మల్కాజిగిరి క్యాంపు కార్యాలయంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలు.. తదుపరి కార్యాచరణపై చర్చించనున్నారు. ప్రధానంగా 38 హంగ్ మున్సిపాలిటీలపై చర్చ జరగనుంది. వీటిలో ఎక్కువ స్థానాలు కాంగ్రెస్ దక్కించుకునేలా మంత్రులకు సీఎం దిశానిర్దేశం చేయనున్నారు. 20కిపైగా హంగ్ మున్సిపాలిటీలు 'హస్త'గతం అవుతాయని ఆ పార్టీ నాయకత్వం అంచనా వేస్తోంది. ఈ సమావేశానికి పలువురు సీనియర్ నేతలూ హాజరయ్యారు.

# కాగ్నో స్పేస్ కాంపిటీషన్‌లో 'ఆరిజిన్' విద్యార్థుల ప్రతిభ



కాగ్నో క్వస్ట్ ఉత్తమ ప్రతిభా అవార్డులు అందుకుంటున్న ఆరిజిన్ సీబీఎస్‌సీ విద్యార్థులు


కాగ్నో స్పేస్ పోటీలలో టాస్క్ పూర్తి చేస్తున్న ఆరిజిన్ స్కూల్ విద్యార్థులు

- స్టమ్ స్ట్రక్షర్ అండ్ మెకానికల్ డిజైన్ క్యాటగిరిలో అవార్డు
- విద్యార్థులను అభినందిన ఆరిజిన్ గ్రూప్ చైర్మన్ ప్రమోద్

ఈకబురు, పటాన్‌చెరు: కాగ్నో స్పేస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కాగ్నో క్వస్ట్ 2025-26 పోటీలలో పటాన్‌చెరుకు చెందిన ఆరిజిన్ సీబీఎస్‌సీ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారు. మల్టీ స్టేట్ రోబోటిక్స్ అండ్ స్టెమ్ కాంపిటీషన్ పేరుతో శనివారం మాదాపూర్ ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన ఈ ప్రతిభా పోటీలలో ఆరిజిన్ స్టూడెంట్స్ తమ నైపుణ్యాన్ని చాటారు. దాదాపు 200 స్కూల్స్ విద్యార్థులు పాల్గొన్న కాగ్నో క్వస్ట్‌లో స్టమ్ స్ట్రక్షర్ అండ్ మెకానికల్ డిజైన్ క్యాటగిరిలో ఆరిజిన్ పాఠశాల విద్యార్థులు మెరిట్ అవార్డును గెలుచుకున్నారు. ఈ ప్రతిభా పోటీలు మొత్తం ఐదు క్యాటగిరిలో జరుగగా, ఎలాంటి ముందస్తు ప్రణాళిక లేకుండా నిర్వాహకులు ఇచ్చిన మెటిరియల్స్‌తో తక్కువ సమయంలో టాస్క్ పూర్తి చేసిన విద్యార్థులను గుర్తించి అవార్డులను అందజేశారు.

**భవిష్యత్ టెక్నాలజీకి అనుగుణంగా తీర్చిదిద్దుతున్నాం : తక్కెలపల్లి ప్రమోద్**

ఈ సందర్భంగా అవార్డులు అందుకున్న విద్యార్థులను ఆరిజిన్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ తక్కెలపల్లి ప్రమోద్, డైరెక్టర్ అర్చన, ప్రిన్సిపాల్స్, సిబ్బంది ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. రీసెర్చ్ మెథడ్స్ డెవలప్‌మెంట్‌తో పాటు రోబోటిక్స్, ఇతర భవిష్యత్ టెక్నాలజీలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని, కాంపిటేటివ్ ఫ్లాట్‌ఫాంలను డెవలప్ చేస్తున్నామని చైర్మన్ ప్రమోద్ తెలిపారు. ఉత్తమ విద్యా ప్రమాణాలతో పాటు విద్యార్థులను భావి భారత శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దే విధంగా ఆరిజిన్ విద్యా బోధన కొనసాగుతోందని పేర్కొన్నారు. ఇప్పటికే ఆరిజిన్ స్టూడెంట్స్ స్టేట్, నేషనల్ లెవెల్ కాంపిటేటివ్ పోటీలలో తమ ప్రతిభను నిరూపించారని, భవిష్యత్తులో మరిన్ని అవార్డులు సాధించాలని ప్రమోద్ ఆకాంక్షించారు.


కాగ్నో స్పేస్ పోటీలలో టాస్క్ పూర్తి చేస్తున్న ఆరిజిన్ స్కూల్ విద్యార్థులు

# మాదాపూర్ సీఎంసి కార్యాలయంలో 16 నుంచి ప్రజావాణి

**బొకేలు, శాలువాలు వద్దు : సీఎంసీ కమిషనర్ సృజన**


జి.సృజన

ఈకబురు, శేరిలింగంపల్లి : సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) పరిధిలో పౌరుల సమస్యల పరిష్కారానికి మాదాపూర్ ప్రధాన కార్యాలయంలో 'ప్రజావాణి' కార్యక్రమం ఈ నెల 16 వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి సృజన తెలిపారు. ఈ మేరకు ప్రజావాణిపై కమిషనర్ ఒక ప్రకటన విడుదల చేశారు. మాదాపూర్ న్యాక్ భవనం సీఎంసి కార్యాలయం మొదటి అంతస్తులో గల మీటింగ్ హాల్‌లో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెల 16 వ తేదీన ప్రారంభించనున్న ప్రజావాణి కార్యక్రమం భవిష్యత్తులో ప్రతి సోమవారం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పౌరుల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, డ్రైనేజ్, వీధి దీపాలు, నిర్మాణ అనుమతులు తదితర అంశాలకు సంబంధించిన సమస్యలను కమిషనర్ ఆధ్వర్యంలో జరిగే ప్రజావాణిలో అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

- బొకేలు, శాలువాలు వద్దు: కమిషనర్ సృజన

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా తనకు శుభాకాంక్షలు చెప్పేందుకు వచ్చేవారు బొకేలు, షాలువాలు తీసుకురావద్దని కమిషనర్ జి.సృజన విజ్ఞప్తి చేశారు. తనను కలిసేందుకు వచ్చే ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు బొకేలు, షాలువాలు, మిఠాయిలు, బహుమతులు తీసుకురావద్దని విజ్ఞప్తి చేశారు. బహుమతులపై ఖర్చు చేయకుండా ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కాగా కమిషనర్ తన నిరాడంబరతను చాటుకుంటూ బొకేలు, శాలువాలు వద్దు అంటూ నిర్ణయం తీసుకోవడం పట్ల సైబరాబాద్ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఫార్ములా ఈకార్ రేస్ కేసులో కీలక పరిణామం

అయితే పురపాలక శాఖ మంత్రి హోదాలో కేటీఆర్ ఆదేశించడంతోనే తాము నిధులు విడుదల చేసినట్లు అప్పట్లో ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కొనసాగిన అర్వింద్‌కుమార్ ఇదివరకే ప్రభుత్వానికి లిఖితపూర్వక వాంగ్మూలం ఇవ్వడంతోపాటు ఏసీబీ విచారణలోనూ అంగీకరించారు.



# తెలంగాణ నేలకు పాదాభివందనం: పవన్ కల్యాణ్

తెలంగాణలో ఉద్భవించిన పార్టీ జనసేన. ఈరోజు విజయలక్ష్మి రూపంలో తొలి అడుగు పడింది. పార్టీ తొలినాళ్ళు గుర్తు చేసుకొంటే దారంతా గతుకులు.. భవిష్యత్తు ఏమిటనే ప్రశ్న. చిన్నపాటి ఆసరా కూడా లేదు. మిణుకుమిణుకుమనే ఆశ. పార్టీ సిద్ధాంతాలను విశ్వసించిన వీర మహిళలు ఝాన్సీ లక్ష్మీభాయి స్ఫూర్తిని నింపుకొని.. ఉద్యమ స్ఫూర్తితో జనసైనికులు ఎలాంటి ఒడిదుడుకులనైనా తట్టుకొనేందుకు సంసిద్ధులయ్యారు. తెలంగాణలోని వీర మహిళలు, జనసైనికులు పురపాలక ఎన్నికలకు సన్నద్ధమయ్యారు. 2998 స్థానాలున్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో జనసేన 332 చోట్ల పోటీ చేసింది. ఒక కౌన్సిలర్ స్థానం, ఒక కార్పొరేటర్ స్థానం జనసేనకు దక్కాయి. మహా వృక్షమైనా చిన్న విత్తు నుంచే నేల పొరలను చీల్చుకొని మొలక వేస్తుంది. విశ్వ విజేత కూడా తల్లి గర్భంలో అణువంతే ఉంటాడు. కోటి రతనాల వీణ తెలంగాణలో జనసేన విజయ ప్రయాణం లేలేత అడుగులతో మొదలైంది. నేరేడుచర్ల మున్సిపాలిటీలో ఆరూరి విజయలక్ష్మి, మంచిర్యాల కార్పొరేషన్‌లో అగ్గు సాగర్ జనసేన అభ్యర్థులుగా సాధించిన విజయాలు భవిష్యత్తు ప్రస్థానానికి బలమైన స్ఫూర్తిని అందిస్తాయి. విజయలక్ష్మి, సాగర్ లకు మన స్ఫూర్తిగా అభినందనలు తెలియచేస్తున్నాను. జనసేన తెలంగాణ వీర మహిళలు, జనసేన సైనికులు, నాయకులకు అభినందనలు. పార్టీ ఉద్భవించిన నేలపై దక్కిన తొలి విజయం ఇది. పోరాట పటిమను.. సంస్కృతి సంప్రదాయాల శక్తిని.. సాహితీ సౌరభాన్ని.. అణువణువునా నింపుకున్న తెలంగాణ నేల తల్లికి హృదయపూర్వక పాదాభివందనాలు' అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# మిగిలిన మావోయిస్ట్‌లు లొంగిపోవాలని డీజీపీ శివధర్ రెడ్డి పిలుపు

మేరకు ఆయన శనివారం ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. రాష్ట్రానికి చెందిన మిగిలిన 15 మంది క్యాడర్‌లు సహా అన్ని స్థాయిల మావోయిస్టులు ముందుకు వచ్చి ప్రభుత్వ సరెండర్ అండ్ రిహాబిలిటేషన్ పాలసీ కింద లొంగిపోవాలని కోరారు. గత రెండు సంవత్సరాల కాలంలో తెలంగాణ పోలీసులు నిరంతర ప్రయత్నాల ఫలితంగా వివిధ స్థాయిలలోని 588 మంది మావోయిస్టు నాయకులు, కార్యకర్తలు సాధారణ జీవితంలోకి తిరిగి చేరినట్లు డీజీపీ వెల్లడించారు. వీరందరూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సరెండర్ అండ్ రిహాబిలిటేషన్ విధానం కింద ఆర్థిక సహాయం, ఉపాధి అవకాశాలు, భద్రతా హామీలు వంటి ప్రయోజనాలను పొందినట్లు తెలిపారు.

--పునరావాస ప్యాకేజీలకు ప్రభుత్వం సిద్ధం..

ప్రస్తుతం వారు తమ కుటుంబాలతో కలిసి స్వగ్రామాల్లో సురక్షితంగా జీవిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పునరావాస విధానం తో ఇతర రాష్ట్రాలకు చెందిన అజ్ఞాత మావోయిస్టులు కూడా తెలంగాణ పోలీసుల ముందు లొంగిపోయిన ఉదాహరణలు ఉన్నాయని పేర్కొన్నారు. మారుతున్న కాలంలో హింసకు స్థానం లేదని, శాంతియుత, నిర్మాణాత్మక పరిష్కారాల ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమని డీజీపీ స్పష్టం చేశారు. మావోయిస్టు నాయకులు తమ కుటుంబాలతో తిరిగి కలిసి, రాష్ట్ర అభివృద్ధి, పురోగతికి సానుకూలంగా దోహదపడాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాన స్రవంతిలోకి రావాలనుకునే వారికి తక్షణ సహాయం, భద్రతా చర్యలు, పునరావాస ప్యాకేజీలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని డీజీపీ తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో స్వేచ్ఛగా, గౌరవంగా జీవించేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని డీజీపీ స్పష్టం చేశారు.



# పుల్వామా అమర జవాన్లకు నివాళులర్పించిన ఆంజనేయులు సాగర్




పుల్వామా దాడిలో మృతి చెందిన జవాన్లకు నివాళులర్పిస్తున్న అంజనేయులు సాగర తదితరులు

ఈకబురు, శేరిలింగంపల్లి : పుల్వామా దాడిలో అమరులైన వీర జవాన్లకు అంజయ్య నగర్ డివిజన్ నాయకులు ఆంజనేయులు సాగర శనివారం నివాళులర్పించారు. 2019 ఫిబ్రవరి 14 వ తేదీన జరిగిన పుల్వామా దాడిలో అమరవీరులైన జవాన్లకు నివాళులర్పిస్తూ అంజయ్య నగర్ డివిజన్ పరిధిలోని సిద్ధిక్ నగర్ లో శనివారం సైనిక్ టీం నాగరాజు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు ఆంజనేయులు సాగర్ పాల్గొని అమరులైన సైనికుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సైనికుల జ్ఞాపకార్థం సైనిక్ టీం ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగుల పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ఆంజనేయులు సగర పాల్గొని విద్యార్థులకు బ్యాగులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీవ్రవాదులు 2019 ఫిబ్రవరి 14న పుల్వామాలు మన సైనికుల మీద దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. పుల్వామా దాడిలో ప్రాణాలు కోల్పోయిన సైనికుల సేవలను దేశం ఎప్పటికీ మర్చిపోదని తెలిపారు. ఈ కార్యక్రమంలో బస్తీ నాయకులు లక్ష్మీబాయి, గువ్వల రమేష్, సాగర్, ఆనంద్, టీం సైనిక్ సభ్యులు, సిద్దిక్ నగర్ యువకులు, స్థానికులు పాల్గొన్నారు.

# అవాస్తవాలను ప్రచారం చేయడమే రాహుల్ సిద్ధాంతం: అమిత్ షా

ఈ డీల్‌తో భారత మత్స్యకారులకు, రైతులకు ఎంతో మేలు జరుగుతుందని షా స్పష్టం చేశారు. పుదుచ్చేరి పర్యటనలో భాగంగా ఆయన రాహుల్ తీరును తప్పుబట్టారు. ''రోజువారీ అబద్ధాలతో రాహుల్ కొత్త సంప్రదాయాన్ని తీసుకొస్తున్నారు. అవాస్తవాలు ప్రచారం చేయడమే ఆయన సిద్ధాంతం. వాటినే పదే పదే చెబుతున్నారు. ఆయన అబద్ధాలను ప్రజలు పట్టించుకోరు. ట్రేడ్ డీల్‌పై ఆరోపణలు చేస్తూ మత్స్యకారులను, రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారు. రైతుల ప్రయోజనాల కోసమే ప్రధాని మోదీ అమెరికాతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఐరోపా, కెనడాలతోనూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై చర్చలు జరిపారు. ఈ ఒప్పందాలతో దేశంలోని మత్స్యకారులకు, రైతులకు, పశుపోషకులకు అపారమైన అవకాశాలు లభిస్తాయి. గత యూపీఏ హయాంలో రైతుల ప్రయోజనాలను తాకట్టు పెట్టేశారు.'' అని అమిత్ షా వ్యాఖ్యానించారు.



# పోలీసుల అదుపులో హెచ్ సి యు లాప్ టాప్ చోరీ నిందితులు



హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ

- చోరీలో విద్యార్థుల పాత్రపై ఆధారాలు

ఈకబురు, శేరిలింగంపల్లి : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో లక్షల రూపాయల విలువైన లాప్ టాప్ ల చోరీ కేసు కొలిక్కి వచ్చినట్లు తెలుస్తుంది. ల్యాప్ టాప్ లను చోరీ చేసిన నిందితులను గచ్చిబౌలి పోలీసులు అరెస్టు చేసినట్లు విశ్వసనీయ సమాచారం అందుతుంది. కాగా లాప్ టాప్ ల చోరీలో విద్యార్థుల పాత్ర ఉన్నట్లు పోలీసులు గుర్తించడం సంచలనంగా మారింది. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ సిఆర్ రావు ఇనిస్టిట్యూట్ లో గత ఐదురోజుల క్రితం 60 ల్యాప్ టాప్ లు చోరీకి గురయ్యాయి. అంతకు రెండు రోజుల క్రితమే కొత్తగా తెచ్చిన ల్యాప్ టాప్ లను కిటికీ గ్రిల్స్ తొలగించి దుండగులు చోరీ చేశారు. చోరీకి గురైన ల్యాప్ టాప్ ల విలువ లక్షల విలువ ఉంటుందని వర్సిటీ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు వర్సిటీ వర్గాల పిర్యాదుతో గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. చోరీ చేసిన ల్యాప్ టాప్ లతో దుండగులు ఓ మారుతీ బెలానో కారులో ప్రధాన గేటు ద్వారా బయటకు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. కారు నెంబరు ఆధారంగా కేసును ఛేదించిన పోలీసులు చోరీలో పాల్గొన్న నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తుంది. కాగా చోరీ చేసిన ల్యాప్ టాప్ లను బెంగళూరుకు తరలించినట్లు గుర్తించిన పోలీసులు వాటిని రికవరీ చేసే పనిలో ఉన్నారు. కాగా ఈ చోరీలో సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన విద్యార్థుల పాత్ర ఉన్నట్లు పోలీసులకు ఆధారాలు లభించడం సంచలనంగా మారింది. వర్సిటీకి కొత్తగా లాప్ టాప్ లు వచ్చాయని గుర్తించిన కొందరు విద్యార్థులు దుండగులతో కలిసి ఈ చోరీకి పాల్పడినట్టు తెలుస్తుంది.

# ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

ఈ కబురు : ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు రావడం కలకలం సృష్టించింది. పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కతా నుంచి మేఘాలయాలోని షిల్లాంగ్ బయలుదేరాల్సిన విమానానికి బాంబు బెదిరింపులు వచ్చాయి. అప్రమత్తమైన సిబ్బంది ప్రయాణికులను కిందకు దింపేశారు. ప్రస్తుతం భద్రత పరమైన తనిఖీలు కొనసాగుతున్నాయి. కోల్‌కతా విమానాశ్రయం నుంచి ఇండిగో విమానం ఉదయం 9:15 గంటలకు షిల్లాంగ్ బయలుదేరేందుకు సిద్ధంగా ఉంది. బోర్డింగ్ సమయంలో విమానం సిబ్బంది టాయిలెట్ కంపార్ట్‌మెంట్‌లో ఓ టిష్యూ పేపర్‌ను గుర్తించారు. దానిపై విమానంలో బాంబు అమర్చినట్లు బెదిరింపు నోట్ రాసి ఉంది. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది ప్రయాణికులను కిందకు దింపేశారు. విమానాశ్రయ అధికారులకు సమాచారం అందించగా.. విమానాన్ని ఐసోలేషన్ బే ఏరియాకు తరలించారు. ప్రస్తుతం సంబంధిత అధికారులు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. ఈ ఘటనపై ఇండిగో ప్రతినిధి స్పందించారు. దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు.



# ఎస్ఎంఎస్‌ల పేరుతో రూ.3,388 కోట్ల వసూలు




**ఎస్ఎంఎస్‌ల పేరుతో రూ.3,388 కోట్ల వసూలు**

టెలికాం కంపెనీలు తమ ప్రమోషన్ల కోసం రోజూ వందల కొద్దీ మెసేజ్‌లను ఉచితంగా పంపిస్తుంటే, మన సొమ్ముకు భద్రతనిచ్చే బ్యాంకులు మాత్రం ప్రతి ఎస్ఎంఎస్‌కు ఛార్జీలు వసూలు చేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఒకప్పుడు కస్టమర్లను ఆకర్షించడానికి ఉచితంగా అందించిన సేవలే ఇప్పుడు బ్యాంకుల ఆదాయ వనరులుగా మారాయి. గడిచిన మూడు ఆర్థిక సంవత్సరాల్లో (2023-25) కేవలం 11 ప్రభుత్వ రంగ బ్యాంకులు ఎస్ఎంఎస్ సేవల ద్వారా ఏకంగా రూ.3,388 కోట్లు వసూలు చేశాయని పార్లమెంట్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

భారీగా వసూళ్లు: టాప్ 6 బ్యాంకుల జాబితా ఎస్ఎంఎస్ అలర్ట్‌ల పేరుతో అత్యధికంగా వసూలు చేసిన బ్యాంకుల్లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అగ్రస్థానంలో ఉంది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి:

| బ్యాంక్ | వసూలు చేసిన సొమ్ము (రూ. కోట్లలో) |
|---|---|
| యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా | 1,188.14 |
| కెనరా బ్యాంక్ | 506.28 |
| పంజాబ్ నేషనల్ బ్యాంక్ | 360.45 |
| సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా | 308.72 |
| ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ | 204.89 |
| బ్యాంక్ ఆఫ్ బరోడా | 202.42 |
| గమనిక: దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన ఎస్‌బీఐ 2020 నుంచి ఎస్ఎంఎస్ సేవలపై ఛార్జీలను రద్దు చేయడం గమనార్హం. | |

ఉచితం నుంచి ఛార్జీల వైపు.. ఎందుకు?

ప్రారంభంలో డిజిటల్ బ్యాంకింగ్‌ను ప్రోత్సహించడానికి బ్యాంకులు ఎస్ఎంఎస్ అలర్ట్‌లను ఉచితంగా అందించాయి. అయితే, ప్రతి ఎస్ఎంఎస్‌కు టెలికాం కంపెనీలకు బ్యాంకులు కొంత మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. ఈ వ్యయాన్ని కస్టమర్ల నుంచే వసూలు చేయడం బ్యాంకులు ప్రారంభించాయి. ట్రాయ్ నిబంధనల ప్రకారం, కమర్షియల్ ఎస్ఎంఎస్‌ల నియంత్రణకు 'డిజిటల్ లెడ్జర్ టెక్నాలజీ'(డీఎల్‌టీ) అమలులోకి వచ్చింది. దీనివల్ల బ్యాంకులపై నిర్వహణ భారం పెరిగింది. వడ్డీ రేట్ల తగ్గింపు వల్ల ఏర్పడే ఆదాయ లోటును భర్తీ చేసుకునేందుకు బ్యాంకులు సర్వీస్ ఛార్జీలపై దృష్టి పెట్టాయి.

కేవలం ఎస్ఎంఎస్‌లే కాదు.. ఏటీఎంలు కూడా!

గతంలో ఉచితంగా లభించి ప్రస్తుతం భారంగా మారిన సేవల్లో ఏటీఎం లావాదేవీలు ప్రధానమైనవి. ఒకప్పుడు ఎన్నిసార్లైనా ఉచితంగా డబ్బులు డ్రా చేసుకునే వెసులుబాటు ఉండేది. ఇప్పుడు పరిమితి దాటితే ప్రతి లావాదేవీకి అదనంగా ఛార్జీలు (జీఎస్టీ అదనం) చెల్లించాల్సి వస్తోంది. ఖాతాలో మినిమం బ్యాలెన్స్ లేకపోతే జరిమానాల రూపంలో బ్యాంకులు భారీగా వసూలు చేస్తున్నాయి. ఏటా డెబిట్ కార్డ్ మెయింటెనెన్స్ పేరుతో రూ.150 నుంచి రూ.500 వరకు బ్యాంకులు కట్ చేస్తున్నాయి. బ్రాంచ్‌కు వెళ్లి నగదు జమ చేసినా లేదా విత్‌డ్రా చేసినా నెలకు నిర్ణీత పరిమితి దాటితే ఛార్జీలు వర్తిస్తున్నాయి.

సామాన్యుడి పొదుపుపై బ్యాంకులు ఈ స్థాయిలో ఛార్జీలు వసూలు చేయడంపై సర్వత్రా అసహనం వ్యక్తమవుతోంది. ఒకవైపు డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహిస్తూనే, మరోవైపు భద్రత కోసం ఇచ్చే ఎస్ఎంఎస్‌లపై కూడా భారం మోపడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఎస్‌బీఐ బాటలోనే మిగిలిన బ్యాంకులు కూడా కనీసం ప్రాథమిక ఎస్ఎంఎస్ అలర్ట్‌లను ఉచితంగా అందిస్తే సామాన్యులకు ఊరట లభిస్తుంది.




## ఏఐతో సైబర్ మోసాలు..

# మీ దగ్గర ఉందా కోడ్ లాంగ్వేజ్!



**రాజీవ్ ఆఫీసులో పనిచేస్తున్నాడు. ఇంతలో ఫోన్ మోగింది. కట్ చేశాడు. మళ్లీ ఫోన్. ఎత్తగానే అవతలి నుంచి 'మావయ్య గారికి యాక్సిడెంట్ అయ్యింది. ఇప్పుడే హాస్పిటల్‌కి వచ్చా. ఇక్కడ ఇన్సూరెన్స్ చెల్లదంటున్నారు. హాస్పిటల్ వారు అడ్వాన్స్‌గా రూ.లక్ష కట్టమంటున్నారు. ఈ నంబర్‌కి పంపించు' అంటూ భార్య ఫోన్ కట్ చేసింది.**

ఇలా ఎవరైనా ఫోన్ చేసి 'ఎమర్జెన్సీ' అని చెప్పగానే కాళ్లూచేతులూ వణికిపోతాయి. ఒళ్లంతా చెమటలు పట్టేస్తాయి. కంగారులో ఏం చేస్తామో మనకే తెలీదు. కానీ, రాజీవ్ మాత్రం ఎప్పటిలానే తన పనిలో మళ్లీ నిమగ్నమైపోయాడు. కాసేపటి తర్వాత భార్యకు ఫోన్ చేసి జరిగిన విషయం చెప్పాడు. ఇద్దరూ కాసేపు నవ్వుకున్నారు. అంతకుముందు భార్య పేరుతో వచ్చిన ఆ కాల్ ఫేక్ అని రాజీవ్ పసిగట్టడమే ఇందుక్కారణం. కానీ అదెలా సాధ్యం? అంత కంగారులోనూ అది ఫేక్ అని ఎలా గుర్తించాడు?.. ఇదే సీక్రెట్ కోడ్ మహిమ. దీన్నే సేఫ్‌వర్డ్ లేదా పాస్‌ఫ్రేజ్‌గా సైబర్ నిపుణులు వ్యవహరిస్తున్నారు. ఇంతకీ ఏమిటిది? ఏఐ యుగంలో ఇదెలా ఉపయోగపడుతుంది?

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కొత్త పుంతలు తొక్కుతోంది. దీన్ని సైబర్ నేరగాళ్లు కూడా అస్త్రాలుగా మలుచుకుంటున్నారు. వాయిస్‌లను క్లోన్ చేసి, డీప్‌ఫేక్ వీడియోలతో అమాయక ప్రజలను బోల్తా కొట్టిస్తున్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితుల పేరుతో వాయిస్/వీడియో కాల్స్ చేసి 'ఎమర్జెన్సీ' అంటూ డబ్బులు కొట్టేస్తున్నారు. ఇలాంటి ఏఐ మోసాల నుంచి మనల్ని మనం రక్షించుకోవాలంటే కుటుంబ సభ్యుల మధ్య ఒక సేఫ్‌వర్డ్/పాస్‌ఫ్రేజ్ ఉండాలని సైబర్ నిపుణులు సూచిస్తున్నారు.

**మోసాలు ఎలా?**

మన ఇంట్లో వ్యక్తులు కంగారుపడుతూ ఫోన్ చేస్తే వేరే తలంపు లేకుండా అవతలి వ్యక్తులు చెప్పింది చేయడానికే ప్రయత్నిస్తాం. దీన్నే ఆయుధంగా మలుచుకుంటున్నారు సైబర్ నేరగాళ్లు. ఇక్కడే ఓ అనుమానం రావొచ్చు. మరి ఆ వాయిస్ వారికి ఎక్కడిది? సామాజిక మాధ్యమాల్లో మనం పెట్టే వీడియోలు, వాయిస్ మెయిల్స్, ఫోన్‌కాల్స్ చాలు.. అవతలి వ్యక్తుల వాయిస్‌ను క్లోన్ చేయడానికి. కేవలం 30 సెకన్ల ఆడియో/వీడియో ఉంటే చాలు ఎవరి వాయిస్‌నైనా ఇట్టే క్లోన్ చేసేయొచ్చని చెబుతున్నారు సైబర్ నిపుణులు. అంతేకాదు హ్యాకర్లు ఇంట్లో వారి ఫోన్ నంబర్లను కూడా స్పూఫ్ చేయగలరు. అంటే మన కాంటాక్టులోని వ్యక్తులే ఫోన్ చేస్తున్నారని మనల్ని నమ్మించగలరు.

**నేరాల నుంచి రక్షించే సేఫ్ వర్డ్**

ఈ తరహా మోసాలను అరికట్టడానికి పాస్‌ఫ్రేజ్ పెట్టుకోవాలంటున్నారు నిపుణులు. ఇందుకోసం ఒక పదం లేదా పదబంధం లేదా ఒక ప్రశ్నను ఎంచుకోవాల్సి ఉంటుంది. ఎంత అత్యవసర సమయంలోనైనా మీరు దాని గురించి ప్రస్తావించగానే అవతలి వ్యక్తులు దానికి సమాధానం ఇచ్చేలా, గుర్తుండేలా సేఫ్‌వర్డ్ ఉండాలి. పాస్‌వర్డ్‌లు, పుట్టినరోజులు, పెట్‌నేమ్స్ వంటివి పెట్టకపోవడం మంచిది. మరీ ముఖ్యంగా ఈ కోడ్‌ను సామాజిక మాధ్యమాల్లో గానీ, ఆన్‌లైన్‌లో గానీ పంచుకోవద్దు. వ్యక్తుల మధ్యే ఉండాలి. కేవలం మీ కుటుంబసభ్యులు, స్నేహితులతోనే పంచుకోండి.

**'ఎమర్జెన్సీ' కాల్స్ వస్తే ఇలా చేయండి..**

సైబర్ నేరగాళ్లు ఒకవేళ ఆడియో కాల్ చేస్తే వెంటనే వీడియో కాల్ ఆన్ చేయండి. వీడియో కాల్ చేస్తారని ఊహించకపోతే అవతలి వ్యక్తి ఇట్టే దొరికిపోతారు. కొన్నిసార్లు వీడియోను కూడా డీప్‌ఫేక్ చేసేందుకు సిద్ధంగా ఉండొచ్చు.

రెండో ఆప్షన్.. ఒకవేళ మీ ఇంట్లో వ్యక్తులే కాల్ చేసినట్లు అనిపించినా వారి మాటల్లో తేడా గమనిస్తే అదే నంబర్‌కు తిరిగి కాల్ చేయండి. తద్వారా వారి క్షేమ సమాచారాన్ని ధ్రువీకరించుకోవచ్చు.

చివరి ఆప్షన్‌గా సేఫ్‌వర్డ్‌ను వాడండి. దానికి సమాధానం చెప్పడానికి అవతలి వారు తటపటాయిస్తే సైబర్ నేరగాళ్ల పనే అని మీరు గుర్తించొచ్చు. వివిధ దేశాల్లో ఈ తరహా మోసాలు పెద్దఎత్తున జరుగుతుండగా.. భారత్‌లోనూ ఈ మోసాలు వెలుగుచూస్తున్నాయి.

ఇంతకీ రాజీవ్ ఏం చేశాడంటే..? తనకు విషయం చెప్పగానే కాల్ కట్ చేసే ముందు "ఓటీటీ సినిమా" అని అడగ్గా.. అవతలి నుంచి సమాధానం లేకుండానే ఫోన్ కట్ అయ్యింది. ఒకవేళ తన భార్యే అయ్యుంటే సమాధానం వచ్చేది. అది రాకపోవడంతో ఇది సైబర్ నేరగాళ్ల పన్నాగం అని రాజీవ్ గుర్తించగలిగాడు. ఇంతకీ వాళ్లు పెట్టుకున్న సేఫ్‌వర్డ్ ఏంటో తెలుసా? ఓటీటీ సినిమాకు సండేమ్యాగీ స్టోరీ!! ఇంకెందుకాలస్యం మీరూ పెట్టుకోండి 'సేఫ్'వర్డ్.

## అప్పుడు డోర్ హ్యాండిల్స్, ఇప్పుడు స్టీరింగ్ వీల్.. నిషేధం!

**చైనా ప్రభుత్వం వాహన భద్రతా ప్రమాణాలను మరింత కఠినతరం చేయడానికి మరో కీలక నిర్ణయం తీసుకుంది. చైనా పరిశ్రమ, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ ప్రతిపాదించిన కొత్త భద్రతా ప్రమాణాలు 2027 జనవరి 1 నుంచి అమల్లోకి రావాలని ఆదేశించింది.**

**ఇప్పటికే ఫ్లష్ డోర్ హ్యాండిల్స్ నిషేధించిన చైనా, ఇప్పుడు యోక్ స్టైల్ హాఫ్ స్టీరింగ్ వీల్స్ సైతం నిషేధించింది. భద్రతా నియమాలను అంతర్జాతీయ ప్రమాణాలకు సరిపోలేలా కఠినతరం చేయడం, ప్రయాణికులకు రక్షణ కల్పించడమే ఈ నిషేధాల వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం. హాఫ్ స్టైల్ స్టీరింగ్ వీల్‌ను టెస్లా ప్రారంభించింది. ఆ తరువాత చాలా చైనీస్ కంపెనీలు ఇలాంటి స్టైల్ ఫాలో అయ్యాయి. ఇలాంటి స్టీరింగ్ వీల్ వల్ల చాలా నష్టాలు ఉన్నాయని ఆటోమొబైల్ నిపుణులు చెబుతున్నారు. రోడ్డు ప్రమాదాల్లో**




**డ్రైవర్లకు కలిగే గాయాలలో సుమారు 46 శాతం స్టీరింగ్ వ్యవస్థ కారణంగా సంభవిస్తున్నాయి. సాధారణ రౌండ్ స్టీరింగ్ వీల్ ప్రమాద సమయంలో.. డ్రైవర్ ముందుకు ఒరిగినప్పుడు శరీరానికి కొంత పట్టు లభిస్తుంది. హాఫ్ స్టీరింగ్ వీల్ శరీరానికి కొంత ప్రమాదం కలిగిస్తుంది.**

**కొత్త ప్రమాణాల ప్రకారం.. 2027 నుంచి చైనాలో అమ్మకానికి వచ్చే కొత్త కార్లు హాఫ్ స్టైల్ స్టీరింగ్ వీల్ పొందకూడదు. అంతే కాకుండా.. ఇలాంటి స్టైల్ స్టీరింగ్ వీల్ కలిగిన వాహనాల్లో కూడా చేంజ్ చేసుకోవడానికి 13 నెలల గడువు ఇచ్చింది. దీన్నిబట్టి చూస్తే.. కార్లను తప్పకుండా నియమాలను పాటించాల్సిందే అని అవగతం అవుతోంది.**

## పసిడి బాండులో రూ.3,449 పెట్టుబడిపై రూ.12,192 లాభం



**రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గతంలో జారీ చేసిన పసిడి బాండ్లలో పెట్టిన పెట్టుబడులపై మదుపర్లు భారీగా ప్రతిఫలాన్ని పొందుతున్నారు. తాజాగా 2019 ఆగస్టు 4న జారీ చేసిన 2019-20 సిరీస్-3 సార్వభౌమ పసిడి బాండ్ల (ఎస్‌జీబీ)కు తుది రిడెమ్షన్ ధరను, యూనిట్‌కు రూ.15,641గా నిర్ణయించారు. అప్పటి మేలిమి బంగారం ధర గ్రాము రూ.3,449 చొప్పున ఈ బాండ్లలో పెట్టుబడి పెడితే, ఇప్పుడు గ్రాముకు రూ.12,192 లాభాన్ని (353.49%) మదుపర్లు పొందనున్నారు. దీనికి వార్షిక వడ్డీ రేటు (2.5%) అదనం. ఈనెల 10 నుంచి 12 వరకు పసిడి ముగింపు ధరల సగటు ఆధారంగా, బాండ్‌కు తుది రిడెమ్షన్ ధరను నిర్ణయించారు.**

# రిలయన్స్ చేతికి వెనెజువెలా చమురు!

వెనెజువెలా నుంచి ముడిచమురును నేరుగా కొనుగోలు చేయడానికి, అమెరికా నుంచి సాధారణ లైసెన్స్‌ను ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) పొందింది. ప్రపంచంలోనే, ఒకేచోట అతిపెద్ద రిఫైనింగ్ సముదాయాన్ని గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో కంపెనీ నిర్వహిస్తున్న ఆర్ఐఎల్, ఇందుకోసం భారీఎత్తున చమురు దిగుమతి చేసుకుంటూ ఉంటుంది. పాశ్చాత్య దేశాల ఆంక్షల నేపథ్యంలో, రష్యా నుంచి చమురు దిగుమతులను సంస్థ నిలిపేసిన సంగతి విదితమే. వెనెజువెలా నుంచి చమురు దిగుమతులు ప్రారంభమైతే, రిలయన్స్ రిఫైనింగ్ మార్జిన్లూ బలోపేతం కానున్నాయి. గత నెలలో వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను నిర్బంధంలోకి తీసుకున్న అమెరికా, ఆ దేశ ముడి చమురు పరిశ్రమపై ఆంక్షలను సడలించింది. ఇప్పటివరకు ట్రేడర్ల ద్వారా వెనెజువెలా చమురును విక్రయించడానికి అమెరికా అనుమతి ఇచ్చింది. ఇప్పుడు ఆర్ఐఎల్‌కు లభించిన సాధారణ లైసెన్స్ వల్ల, ఏదైనా సంస్థ వెలికితీసిన లేదా ఆధీనంలో ఉన్న చమురును నేరుగా కొనుగోలు చేసే అధికారం లభిస్తుంది.

ఆరేళ్లుగా ఆంక్షల చట్రంలో

వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో పాలనపై 201920లో అమెరికా ఆంక్షలు విధించింది. అప్పటివరకు వెనెజువెలా ముడిచమురును ఆర్ఐఎల్ కొనుగోలు చేసినా, అంతటితో ఆపేసింది. 2024లో తాత్కాలిక ఉపశమనం ఇవ్వడంతో, మళ్లీ చమురును కొనుగోలు చేసింది. ఈ ఏడాదిలో ట్రేడర్ల ద్వారా వెనెజువెలా విక్రయాలు ప్రారంభమయ్యాక.. అంతర్జాతీయ ట్రేడింగ్ సంస్థ విటోల్ నుంచి 2 మిలియన్ బ్యారెళ్లు కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదుర్చుకుంది. ఈ అవకాశాన్ని వినియోగించుకుని ప్రభుత్వ రంగ సంస్థలు ఐఓసీ, హెచ్‌పీసీఎల్ కూడా 2 మిలియన్ బ్యారెళ్లు కొనుగోలు చేశాయి. ఇందులో 5 లక్షల బ్యారెళ్ల చమురును విశాఖపట్నంలోని యూనిట్‌కు హెచ్‌పీసీఎల్ కేటాయించిందని సమాచారం.

రాయితీకి లభిస్తోంది వెనెజువెలా ముడిచమురు గ్రేడ్‌లు, ముఖ్యంగా ఒరినోకో ప్రాంతం నుంచి వచ్చేవి సంక్లిష్టంగా, భారీగా ఉంటాయి. వీటిని సమర్థంగా




ప్రాసెస్ చేసే సామర్థ్యాలు జామ్‌నగర్ రిఫైనరీలో ఉన్నాయి. రవాణా ఇబ్బందుల కారణంగా వెనెజువెలా చమురు కొంత రాయితీ ధరలకే లభిస్తోంది. దీనిని డీజిల్, కిరోసిన్, వంటగ్యాస్ (ఎల్‌పీజీ)గా మార్చొచ్చు. రిలయన్స్ రిఫైనింగ్ మార్జిన్‌లు పెరగడానికి ఇది దోహదం చేయనుంది.

# పెళ్లి చేసుకుంటాను..కానీ?



**కొన్ని రోజులుగా వరుసగా రూమర్స్‌తో వార్తల్లో ఉంటున్నారు నటి మృణాల్ ఠాకూర్ (Mrunal Thakur). ధనుష్‌తో ఆమె ప్రేమలో ఉన్నారంటూ ప్రచారం జోరుగా సాగుతోంది. వీరిద్దరూ ఫిబ్రవరి 14న పెళ్లి చేసుకోనున్నారంటూ రూమర్స్ వచ్చాయి. వాటిని ఖండించారు. తాజాగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన పెళ్లి గురించి మాట్లాడారు. వివాహం విషయంలో తొందరపడటం లేదన్నారు.**

"పెళ్లి చేసుకుంటాను. కానీ.. దానికి సమయం రావాలి. సరైన వ్యక్తి నా జీవితంలోకి వచ్చినప్పుడు వివాహబంధంలోకి అడుగుపెడతాను. అప్పుడు నేనే స్వయంగా చెబుతాను. నా సోషల్ మీడియా అకౌంట్స్‌లో నేనే పోస్ట్ చేస్తాను. ఆ విషయాన్ని మీతో పంచుకునే మొదటి వ్యక్తిని నేనే" అని చెప్పారు. ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు పెళ్లిపై అందరి ఆలోచనల్లో మార్పు వచ్చిందని మృణాల్ అన్నారు. ఇక ప్రేమికుల రోజు తన పెళ్లి జరగనుందంటూ వచ్చిన వార్తలపై ఆమె హాస్యాస్పదంగా స్పందించారు. నేడు ఫిబ్రవరి 14. మరికొన్ని రోజుల్లో ఏప్రిల్ 1 వస్తుంది.. ఆరోజు ఫూల్స్‌డే కదా.. అని సెటైర్ వేశారు. ఇక ఇటీవల ఆమె తన మాజీ బాయ్‌ఫ్రెండ్ గురించి చెప్పిన విషయం తెలిసిందే. తాను యాక్టింగ్ చేయడం అతడికి నచ్చలేదని అందుకే బ్రేకప్ చెప్పినట్లు వెల్లడించారు. అలాంటివాళ్లతో కొనసాగడం కూడా కష్టమేనని అందుకే విడిపోయినట్లు చెప్పారు.





## షూటింగ్ ఆలస్యం.. ధనుష్‌కు లీగల్ నోటీసులు

కోలీవుడ్ నటుడు ధనుష్ మరోసారి చిక్కుల్లో పడ్డారు. తమిళ నిర్మాణసంస్థ తేనాండాళ్ ఫిల్మ్‌స్‌తో ధనుష్ వివాదం రోజురోజుకు ముదురుతోంది. కమిట్‌మెంట్ పూర్తి చేయకపోవడం వల్ల సినిమా ఆలస్యమవుతోందని.. రూ.20 కోట్లు నష్టపరిహారం చెల్లించాలని లీగల్ నోటీసులు పంపింది. ప్రస్తుతం ఈ విషయం కోలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది.

"2016లో ఈ నిర్మాణ సంస్థపై 'నాన్ రుద్రన్' సినిమా చేయడానికి ఆయన ఒప్పందం కుదుర్చుకున్నారు. తన స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించాలని భావించారు. తర్వాత దర్శకుడు మారడంతో ధనుష్ (Dhanush) వారికి స్క్రిప్ట్ పూర్తిగా ఇవ్వలేదని నిర్మాణ సంస్థ ఆరోపణలు చేస్తోంది. దీని కారణంగా షూటింగ్ ఆలస్యం అవుతోందని దీంతో రూ.20కోట్లు నష్టం వచ్చిందని సంస్థ తెలిపింది. ధనుష్ ఇప్పటివరకు షూటింగ్‌కు హాజరుకాలేదని.. దీన్ని పక్కనపెట్టి ఇతర చిత్రాలను అంగీకరిస్తున్నారని లీగల్ నోటీసులు పంపింది. దీనిపై హీరో టీమ్ ఇంకా స్పందించలేదు. ప్రస్తుతం ధనుష్ తన 55వ సినిమాలో నటిస్తున్నారు. 'డీ 55' (D55) వర్కింగ్ టైటిల్‌గా రూపొందుతోన్న ఈ సినిమాలో శ్రీలీల (SreeLeela), సాయి



## సూర్య-జ్యోతిక ప్రేమను నేను అంగీకరించలేదు
# నటుడి తండ్రి కామెంట్స్



ఇండస్ట్రీలో అందమైన జోడీల్లో సూర్యజ్యోతిక జంట ముందుంటుంది. సినిమా కార్యక్రమాల్లో, వ్యక్తిగత వేడుకల్లోనూ ఇద్దరూ చూడముచ్చటగా కనిపించి అందరినీ ఆకర్షిస్తారు. తాజాగా సూర్య తండ్రి, నటుడు శివకుమార్ ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. తాను మొదట వీరి ప్రేమను అంగీకరించలేదన్నారు. కానీ.. సూర్య పట్టుపట్టడంతో అంగీకరించినట్లు చెప్పారు. "సూర్య (Suriya Jyotika) తన ప్రేమ గురించి చెప్పగానే కుదరదు అన్నాను. జ్యోతికతో మాత్రమే జీవితాన్ని పంచుకుంటానని అతడు మొండి పట్టుపట్టాడు. లేదంటే జీవితాంతం ఒంటరిగా ఉంటానని అన్నాడు. వెంటనే నా కెరీర్‌లో నేను నటించిన 150 ప్రేమకథలు నాకు గుర్తొచ్చాయి. దీంతో అంగీకరించాను" అని శివకుమార్ పంచుకున్నారు. సూర్య మొదట్లో చాలా బిడియంగా ఉండేవాడని జ్యోతిక తన జీవితంలోకి వచ్చాక తనలో చాలా మార్పులు వచ్చాయని చెప్పారు. 'ఒకప్పుడు మౌనంగా ఏమీ మాట్లాడని కుర్రాడేనా ఇప్పుడు ఇద్దరు బిడ్డలను చూసుకుంటున్నాడు' అని ఒక్కోసారి తనకు అనిపిస్తుందని.. సూర్యను ఉద్దేశించి శివకుమార్ ఫన్నీ కామెంట్స్ చేశారు. ఆఫ్‌స్క్రీన్, ఆన్‌స్క్రీన్‌లో హిట్ జోడీ అయిన సూర్య, జ్యోతిక తమిళంలో 'పూవెల్లం కేట్టుప్పార్' మొదలుకొని ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో కలిసి నటించి, మెప్పించారు. ఈ సినిమా సమయంలోనే వీరిద్దరి మధ్య ప్రేమ చిగురించింది. 2006 సెప్టెంబర్ 11న వివాహం చేసుకున్నారు.







## శ్రీవిష్ణు వర్సెస్ శ్రీవిష్ణు..
# ఒక్కరోజు తేడాతో రెండు సినిమాలు

టాలీవుడ్‌లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకోనుంది. ఒక్కరోజు తేడాతో ఒకే హీరోవి రెండు సినిమాలు ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. శ్రీ విష్ణు నటించిన రెండు చిత్రాలు ఈ నెలాఖరులో సందడి చేయనున్నాయి.

శ్రీ విష్ణు హీరోగా శ్రీహుసేన్ షా కిరణ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మృత్యుంజయ్' (Mrithyunjay). ఫిబ్రవరి 27న విడుదల కానుంది. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ కథతో రానున్న ఈ చిత్రంలో రెబా మోనికా జాన్ కథానాయికగా నటించారు. ఇటీవల టీజర్‌ను విడుదల చేయగా అది ఆకట్టుకుంది. నేడు మరో సినిమా 'విష్ణు విన్యాసం' (Vishnu Vinyasam) రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. యదునాథ్ మారుతి రావు దర్శకత్వంలో రూపొందిన ఈ కామెడీ డ్రామాని ఫిబ్రవరి 28న విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. దీంతో ఒక్కరోజు తేడాతోనే రెండు చిత్రాలు విడుదల కానున్నాయి.

'విష్ణు విన్యాసం'లో విష్ణు సరసన నయన్ సారిక నటించారు. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా 'మొదలే మొదలే...' అంటూ సాగే గీతాన్ని పంచుకున్నారు. 'మృత్యుంజయ్' ఓటీటీ హక్కులను నెట్‌ఫ్లిక్స్.. 'విష్ణు విన్యాసం'ను అమెజాన్ ప్రైమ్ వీడియో సొంతం చేసుకున్నాయి.

## థియేటర్‌లో విడుదలైన వారంలోనే ఓటీటీలోకి..



రెజ్లింగ్ నేపథ్య కథతో రూపొందిన పాన్ ఇండియా చిత్రం 'చథా పచ్చ'. 'ది రింగ్ ఆఫ్ రౌడీస్' అనేది ఉపశీర్షిక. మలయాళ నటులు అర్జున్ అశోకన్ (Arjun Ashokan), రోషన్ మాథ్యూ (Roshan Mathew) ప్రధాన పాత్రధారులు. అద్వైత్ నాయర్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ ఇప్పటికే మలయాళంలో విడుదలైంది. తాజాగా తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ మూవీ ఓటీటీలో స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది.

నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఫిబ్రవరి 19వ (chatha pacha ott release date) తేదీ నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ నెట్‌ఫ్లిక్స్ పోస్టర్‌ను పంచుకుంది. మలయాళంలో ఈ మూవీ సుమారు రూ. 30 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. నెట్‌ఫ్లిక్స్‌లో మలయాళంతో పాటు, తెలుగు, హిందీ, కన్నడ, తమిళ భాషల్లో అందుబాటులోకి రానుంది. రెజ్లింగ్ క్లబ్‌ను స్థాపించిన ముగ్గురు సోదరుల కథతో సాగే ఈ యాక్షన్ కామెడీ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించింది. మమ్ముట్టి ఇందులో అతిథి పాత్రలో మెరిశారు.

## 'ధురంధర్'లో విలన్ రోల్ మిస్సయారా?.. నాగార్జున క్లారిటీ..!

కథానాయకుడిగానే కాదు, ప్రత్యేక పాత్రల్లోనూ మెరుస్తున్నారు నాగార్జున (Nagarjuna). ఇటీవల 'కూలీ'లో ప్రతినాయకుడు సిమన్ పాత్రలో నటించి మెప్పించారు. సినిమా ఫలితం ఎలా ఉన్నా, ఆయన పాత్ర, నటనకు మంచి మార్కులు పడ్డాయి. ఈ నేపథ్యంలో నాగార్జున ఓ మంచి అవకాశాన్ని పోగొట్టుకున్నారంటూ సామాజిక మాధ్యమాల వేదికగా వార్తలు హల్ చల్ చేశాయి. తాజా బాలీవుడ్ సంచలనం 'ధురంధర్'. రణ్‌వీర్ సింగ్ కథానాయకుడిగా ఆదిత్యధర్ రూపొందించిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. ఇందులో రెహమాన్ డెకాయిత్ పాత్రలో అక్షయ్ ఖన్నా అదరగొట్టారు. ఈ పాత్ర కోసం చిత్ర బృందం నాగార్జునను సంప్రదించిందని వార్తలు వచ్చాయి. 'కూలీ' కారణంగానే 'ధురంధర్'లో (Dhurandhar) రెహమాన్ పాత్రను వదులుకున్నారంటూ పలు వార్తలు రాసుకొచ్చారు. దీనిపై నాగార్జున స్పందించారు. అక్షయ్ ఖన్నా పాత్రను మీకు ఆఫర్ చేశారట నిజమేనా? అని ప్రశ్నించగా 'అలాంటిదేమీ లేదు. నాకు ఎవరూ ఏ పాత్ర చేయమని అడగలేదు. అయితే, 'ధురంధర్' సూపర్‌మూవీ. ఆదిత్యధర్ అద్భుతంగా దర్శకత్వం వహించారు. ఆయన తీసిన 'ఉరి' మూవీ కూడా ఇష్టమే. 'ధురంధర్'లో అందరూ చక్కగా నటించారు. అక్షయ్‌ఖన్నా నటన సినిమాకే హైలైట్. సీక్వెల్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నా. అది కూడా విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నా" అని అన్నారు.

ఇక నాగ్ 100వ సినిమా గురించి అడగ్గా 'మేమేమీ తొందరపడటం లేదు. సినిమా చకచకా పూర్తి చేసేయాలన్న ఆలోచన లేదు. దానిని ప్రత్యేక మూవీగా తీర్చిదిద్దాలనుకుంటున్నాం. 'ధురంధర్' చూసిన తర్వాత ఒక విషయమైతే అర్థమైంది. ప్రేక్షకులు అంతర్జాతీయ ప్రమాణాలతో తీసిన కథలను చూసేందుకు ఆసక్తి చూపుతున్నారు" అని అన్నారు. ప్రస్తుతం నాగ్ తన 100వ సినిమా '#King100'పై దృష్టి సారించారు. కార్తీక్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం త్వరలోనే సెట్స్ పైకి వెళ్లనుంది. అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ మూవీని యాక్షన్ డ్రామాగా తీర్చిదిద్దుతున్నారు. మరోవైపు 'ధురంధర్2' విడుదలకు రెడీ అవుతోంది. మార్చి 19న (dhurandhar 2 release date) ఈ మూవీ హిందీతో పాటు, తెలుగు, తమిళ భాషల్లోనూ విడుదల కానుంది.





# అవును..భారత్‌పై మాకు మంచి రికార్డ్ లేదని అంగీకరిస్తాం: పాక్



టీ20 ప్రపంచ కప్‌లో భారత్‌తో మ్యాచ్ కోసం సన్నద్ధమవుతున్నట్లు పాకిస్థాన్ కెప్టెన్ సల్మాన్ అఘా తెలిపాడు. టీమ్‌ఇండియాతో పోరు సందర్భంగా ప్రెస్ కాన్ఫరెన్స్‌లో అఘా పాల్గొన్నాడు. ఉస్మాన్ తారిఖ్, బాబర్ అజామ్ ఫామ్, భారత ఆటగాళ్లతో కరచాలనం మొదలైన అంశాలపై స్పందించాడు. కొలంబో వేదికగా భారత్ పాకిస్థాన్ మ్యాచ్ ఫిబ్రవరి 15న (ఆదివారం) జరగనుంది. ''ప్రపంచ కప్ టోర్నీల్లో మాకు భారత్‌పై మంచి రికార్డు లేదు. గత చరిత్రను మేం మార్చలేం. అయితే, ఈసారి తప్పకుండా మెరుగైన ప్రదర్శన చేసేందుకు ప్రయత్నిస్తాం. జట్టులోని ప్రతి ఒక్కరిదీ కీలక పాత్రే. తారిఖ్ బౌలింగ్ యాక్షన్‌పై వచ్చే విమర్శలను పట్టించుకోం. ఇప్పటికే అతడి బౌలింగ్ యాక్షన్‌పై ఐసీసీ రివ్యూ చేసి క్లీన్‌చిట్ ఇచ్చింది. మా సీనియర్ ప్లేయర్ బాబర్ అజామ్ ఫామ్ గురించి మాకెలాంటి ఆందోళన లేదు. తప్పకుండా అతడు పరుగులు చేస్తాడని ఆశిస్తున్నాం. బ్యాటింగ్ ఆర్డర్‌లో ఎక్కువగా మార్పులు చేయం. భారత ఆటగాళ్లతో కరచాలనం ఏదీ ఇప్పుడే చెప్పలేం. వారు ఇస్తే తప్పకుండా మేమూ షేక్‌హ్యాండ్ ఇస్తాం. టీమ్‌ఇండియా ఓపెనర్ అభిషేక్ శర్మ కోలుకుని మ్యాచ్‌లో ఆడతాడని ఆశిస్తున్నాం. అత్యుత్తమ ఆటగాళ్లు ఉండాలని మేమూ కోరుకుంటాం. టాస్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. మ్యాచ్ ఫలితాన్ని అది నిర్ణయించదు. ఎవరు మంచి క్రికెట్ ఆడితే వారిదే విజయం. ఆటే ప్రధానం. టాస్ కాదు'' అని సల్మాన్ వెల్లడించాడు.

# ప్పట్లో ధోని కెప్టెన్సీ ఎందుకు వీడాడంటే..: జతిన్ పరాంజ్‌పే



రోహిత్ శర్మ నుంచి శుభ్‌మన్ గిల్‌కు 2025లో కెప్టెన్సీ మార్పు జరిగింది. ఇది భారత క్రికెట్‌లో చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. అలాగే గతంలో 2017లో ఎం.ఎస్.ధోని నుంచి విరాట్ కోహ్లికి సారథ్య బాధ్యతలు బదిలీ అయ్యాయి. అప్పటి సంగతులు తాజాగా బయటకు వచ్చాయి. 2014లోనే ధోని.. టెస్ట్ కెప్టెన్సీ నుంచి వైదొలిగాడు. 2017లో విరాట్ కోహ్లికి అన్ని ఫార్మాట్లలో కెప్టెన్సీ పగ్గాలు అప్పగించారు. భారత క్రికెట్ నియంత్రణ మండలి (BCCI) సెలక్షన్ కమిటీ.. కెప్టెన్సీ మార్పు గురించి ధోనితో మాట్లాడిందని, కెప్టెన్సీ నుంచి వైదొలగుతున్నట్టు ఈమెయిల్ రాయమని చెప్పిందని ఇప్పుడు వెల్లడైంది! ఈ విషయాన్ని ధోనీకి అప్పటి చీఫ్ సెలెక్టర్ ఎమ్ఎస్కే ప్రసాద్ ఎలా తెలియజేశారో బీసీసీఐ (BCCI) సెలక్షన్ ప్యానెల్ మాజీ సభ్యుడు జతిన్ పరాంజ్‌పే గుర్తు చేసుకున్నారు. ''అప్పుడు మహీ (ధోని) బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తున్నాడు. అతను గంట పాటు బ్యాటింగ్ చేస్తూనే ఉన్నాడు. ఎమ్మెస్కే, నేను ఒకరినొకరు చూసుకున్నాం. అతడికి అత్యంత గౌరవప్రదంగా ఎలా వివరించాలో చర్చించుకున్నాం. అతడి వద్దకు వెళ్లి.. 'ఇది మార్పునకు సరైన సమయమని అనుకుంటున్నాం' అని చెప్పాం.." అని పరాంజ్‌పే ఒక క్రికెట్ షోలో గుర్తు చేసుకున్నారు. ధోని ప్రతిస్పందన సానుకూలంగా ఉందని ఆయన వెల్లడించారు. ''అప్పుడు సమాధానంగా ధోని.. 'అన్నా, ఇది సరైన నిర్ణయం. నా నుంచి మీకు ఏమి కావాలో తెలియజేయండి' అని.. ఎమ్మెస్కేతో అన్నాడు. మీరు కెప్టెన్సీ నుంచి తప్పుకోవడానికి సిద్ధంగా ఉన్నారని రాతపూర్వకంగా తెలియజేయాలని ఎమ్మెస్కే చెప్పాడు. అప్పుడు ధోని.. 'సరే, నేను చేస్తాను' అని సమాధానం ఇచ్చాడు. ''అదే రోజు రాత్రి ఆలస్యంగా, ఒక ఇమెయిల్ వచ్చింది. అందులో.. 'నేను కెప్టెన్సీ నుంచి వైదొలగాలని అనుకుంటున్నాను' అని ధోని పేర్కొన్నాడు. మేము ఆ నిర్ణయం తీసుకున్నప్పుడు చాలా విమర్శలు వచ్చాయి. కానీ టీమ్ భవిష్యత్తు దృష్ట్యా తప్పలేదు' అని పరాంజ్‌పే గుర్తు చేసుకున్నారు. అలాగే ధోని.. కోహ్లికి ఎలా మద్దతుగా నిలిచాడో కూడా వెల్లడించాడు. ''తర్వాత ధోని మాతో కోహ్లి గురించి ఇలా చెప్పాడు.. 'విరాట్ నా తమ్ముడు లాంటి వాడు. నాకు ఉన్న అనుభవం అంతా అతడికి ఇస్తా. మనం మంచి జట్టును నిర్మిద్దాం' అన్నాడు'' అని పరాంజ్‌పే వెల్లడించాడు.

# వర్షం వల్ల ఇండియా పాక్ మ్యాచ్ రద్దైతే..?

పొట్టి ప్రపంచకప్‌లో భాగంగా ఆదివారం భారత్, పాక్.. కొలంబోలోని ప్రేమదాస స్టేడియం వేదికగా తలపడనున్నాయి. అయితే ఈ మ్యాచ్‌కు వర్షం ముప్పు పొంచి ఉందని వార్తలు వస్తున్నాయి. ఒక వేళ ఈ మ్యాచ్ రద్దైతే పరిస్థితి ఏంటనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. అయితే రిజర్వ్ డే లేనందున మ్యాచ్ జరగకుంటే మరో రోజు ఈ మ్యాచ్ నిర్వహించే పరిస్థితి లేదు. దీంతో అభిమానులు కాస్త నిరుత్సాహానికి గురవుతున్నారు. వర్షం పడకూడదని కోరుకుంటున్నారు. ఈ మెగాటోర్నీలో సెమీఫైనల్, ఫైనల్‌స్‌కు మాత్రమే రిజర్వ్ డే ఉంది.

**——చెరో పాయింట్..**

ఒక వేళ వర్షం కారణంగా ఈ మ్యాచ్ పూర్తిగా తుడిచి పెట్టుకుపోతే భారత్, పాక్‌కు తలో పాయింట్ వస్తాయి. ఇప్పటికే ఇరుజట్లు చెరో రెండు మ్యాచ్‌లు గెలిచి నాలుగు పాయింట్లతో ఉన్నాయి. అప్పుడు భారత్, పాక్ ఖాతాల్లోని మొత్తం పాయింట్లు అయిదుకు చేరతాయి. గ్రూప్ ఏలోని మిగతా జట్లైన యూఎస్ఏ, నెదర్లాండ్ మూడు మ్యాచ్‌లు ఆడి ఒక మ్యాచ్‌లో గెలిచాయి. దీంతో వాటి ఖాతాలో తలో రెండు పాయింట్లున్నాయి. నమీబియా రెండు మ్యాచ్‌లు ఆడితే రెండింట్లోనూ ఓడిపోయి సున్నా పాయింట్లతో ఉంది.

**——తప్పని నష్టం..**

కొన్ని రోజుల క్రితం వరకు భారత్‌తో తాము మ్యాచ్ ఆడబోమని పాక్ చెప్పింది. ఐసీసీ హెచ్చరికలతో పాక్ దిగివచ్చి భారత్‌తో మ్యాచ్ ఆడేందుకు అంగీకరించింది. ప్రస్తుతానికి అంతా బాగానే ఉందని ఆనందించేలోగా వరుణుడు అందరి ఆశలపై నీళ్లు చల్లేలా ఉన్నాడు! ఒకవేళ వర్షం వల్ల మ్యాచ్ పూర్తిగా రద్దైతే.. బ్రాడ్‌కాస్టర్లు భారీగా నష్టపోవాల్సి వస్తుంది. శ్రీలంక క్రికెట్ బోర్డ్ కూడా టికెట్ల రూపంలో వచ్చే ఆదాయాన్ని కోల్పోయే ప్రమాదముంది.



## అభిషేక్ శర్మ ఆడతాడు..

# ఆ నిర్ణయం మా చేతుల్లో ఉండదు: సూర్యకుమార్

ప్రత్యర్థి ఆటగాళ్లు ఎలా ఆడతారనే దానిపై కాకుండా.. తమ బలాలపైనే ప్రధానంగా దృష్టి పెడతామని భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తెలిపాడు. టీ20 ప్రపంచ కప్‌లో భాగంగా ఆదివారం పాకిస్థాన్‌తో టీమ్‌ఇండియా ఆడనుంది. ఈ నేపథ్యంలో సూర్యకుమార్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నాడు. భారత జట్టు కూర్పు, పాక్ ప్లేయర్లకు కరచాలనం, తారిక్ బౌలింగ్‌ను ఎదుర్కోవడంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ''అభిషేక్ శర్మ తప్పకుండా ఆడతాడు. అతడి ఆరోగ్యం బాగా ఉంది. ఫైనల్ XIలో ఉంటాడు. పాక్ స్పిన్నర్ ఉస్మాన్ తారిక్‌ను ఎదుర్కోవడంపై మేం కసరత్తు చేశాం. అతడి శైలి భిన్నమైందే. అలాగని మేం వదిలిపెట్టేదిలేదు. అతడి బౌలింగ్‌లో ఆడేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నాం. పాక్ ఆటగాళ్లతో కరచాలనం ఇవ్వడంపై మీరు (విలేకర్లను ఉద్దేశించి) 24 గంటలు వెయిట్ చేయాలి. టాస్ సమయంలో ఆలోచిస్తాం. కుల్‌దీప్ యాదవ్ తుది జట్టులో ఉండాలని మీరు (నవ్వుతూ) కోరుకుంటే తప్పకుండా ఉంటాడు. అయితే, మా బలాలపైనే మేం దృష్టిపెడతాం. ప్రత్యర్థి ఎలా ఆడతారనేది అవసరం లేదు. ఎవరు ఉత్తమ ఆటతీరు ప్రదర్శిస్తారో వారిదే విజయం'' అని సూర్య తెలిపాడు.

**——బ్యాటింగ్‌లో ఇబ్బందులపై..**

వరుసగా రెండు మ్యాచుల్లోనూ గెలిచినా.. మిడిలార్డర్ ఇబ్బంది పడటంపై సూర్య స్పందించాడు. ''మాకు అద్భుతమైన ఆరంభం వస్తోంది. అయితే, దానిని కొనసాగించలేకపోతున్నామనేది వాస్తవం. అందులో ఎలాంటి అనుమానం లేదు. జట్టులోని ప్రతి ఒక్కరూ అనుభవజ్ఞులే. వ్యక్తిగతంగా వారికంటూ వ్యూహాలు ఉంటాయి. తప్పకుండా అందరూ మెరుగైన ఆటతీరు ప్రదర్శిస్తారని ఆశిస్తున్నా'' అని సూర్య వెల్లడించాడు.

**——అది మా చేతుల్లో ఉండదు..**

''పాకిస్థాన్‌తో మ్యాచ్ అంటే ఒత్తిడి ఉండటం సహజమే. ఇది కూడా మరో మ్యాచ్ అనుకొని బరిలోకి దిగుతాం. ఇరు జట్లు తరచూ ఆడకపోవడం కూడా ఒత్తిడిగా అనిపిస్తుంటుంది. భారత్ పాక్ మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు నిర్వహించాలన్న నిర్ణయం మన చేతుల్లో ఉండదు. ఎప్పుడైతే అలాంటి స్థాయిలో నేను ఉంటానో.. అప్పుడు నిర్ణయం తీసుకోగలను'' అని కెప్టెన్ సూర్య తెలిపాడు.




# బాబూ.. మీరూ 'బాధ్యత' తీసుకోవాలి!

● **టాప్ ఆర్డర్ అదరగొట్టేస్తోంది.. కెప్టెన్ సూర్య సూపర్‌గా ఆడేస్తున్నాడు.. హార్దిక్ బ్యాట్ ఝుళిపిస్తున్నాడు.. బౌలర్లు చెలరేగుతున్నారు... ప్రపంచకప్‌లో భారత్‌కి తిరుగేలేదు. ఆగండాగండి ఇలా సంబరపడటం తొందరపాటే అవుతుంది. ఎందుకంటే మనోళ్లు రెండు మ్యాచ్‌లు గెలిచారు. కానీ లోటుపాట్లు అలానే ఉన్నాయి. అవేంటి? వాటిని ఎలా అధిగమించాలి?**





**● ఫస్ట్ డేంజర్ బెల్**

అమెరికాతో మ్యాచ్.. అభిషేక్ డకౌట్. ఇషాన్ కిషన్, తిలక్ వర్మ సమయోచితంగా పరుగులు రాబట్టారు. అప్పుడే కుదుపు వచ్చింది. వరుసగా వికెట్లు పడ్డాయి. కెప్టెన్ సూర్యకుమార్ చివరివరకూ క్రీజ్‌లో నిలబడ్డాడు. అతడికి అండగా నిలవాల్సిన మిడిల్, లోయర్ ఆర్డర్ బ్యాటర్లు చేతులెత్తేశారు.. సరే పిచ్ అలా ఉంది కదా అని అభిమానులూ అప్పటికి సరిపెట్టుకొన్నారు.

**● రెండో డేంజర్ బెల్..**

నమీబియాతో మ్యాచ్‌లో మన మిడిలార్డర్ డొల్లతనం బయటపడింది. ఓపెనర్లు ఇషాన్ కిషన్ సంజు శాంసన్ జోరు చూసి కనీసం 250+ స్కోరు వస్తుందని అనుకున్నారంతా. 6.5 ఓవర్లు అంటే 41 బంతుల్లో 103/1 స్కోరు చేసిన జట్టు.. ఇన్నింగ్స్ ముగిసేసరికి 209/9 స్కోరుతోనే సరిపెట్టుకుంది. ఒకవిధంగా ఇది ఫెయిల్యూరే. చివరి 10 బంతుల్లో 5 వికెట్లు పడటం ఆలోచించాల్సిన విషయమే.

**● పాక్‌తో కఠిన సవాల్..**

గ్రూప్ స్టేజ్‌లో టీమ్‌ఇండియా ఇంకా పాకిస్థాన్ (ఫిబ్రవరి 15న), నెదర్లాండ్స్ (ఫిబ్రవరి 18న)తో మ్యాచ్‌లు ఆడనుంది. ఈ రెండు జట్లతోనూ ప్రమాదం తప్పదు. ఆ మ్యాచుల్లో టాప్ ఆర్డర్ మాత్రమే రాణిస్తే నే సరిపోదు. చివరి బ్యాటర్ వరకూ భాగస్వామ్యం ఉంటేనే భారీ స్కోరు, ఆపై విజయం దక్కుతాయి. పాక్‌తో మ్యాచ్‌లో కొత్త బౌలర్ తారిఖ్ ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. మిడిల్ ఓవర్లలో బౌలింగ్ చేసే అతడిని ఎదుర్కోవడంలో ఇబ్బందిపడితే మనకు కష్టాలు తప్పవు. భిన్నమైన బౌలింగ్ శైలితో అతడు బంతులేస్తున్నాడు. మనకు చాలా ఏళ్లుగా విజయాలు అందిస్తున్న దూకుడు మంత్రంతో ప్రతి బంతినీ భారీ షాట్ కొడదామంటే కుదరదు. టాప్ ఆర్డర్ బాగా ఆడినప్పుడు లోయర్ ఆర్డర్ బ్యాటర్లపై ఒత్తిడి ఉండదు. దానిని సద్వినియోగం చేసుకుని స్కోరు బోర్డును పరుగులు పెట్టించాలి. పాక్‌తో మ్యాచ్‌కు ముందు మన మేనేజ్‌మెంట్ దృష్టిపెట్టాల్సిన అత్యంత కీలకమైన విషయం ఇదే.

**● తీసుకోవాల్సిన జాగ్రత్తలివీ..**

టాప్ ఆర్డర్‌లోని బ్యాటర్లలో కనీసం ఒక్కరైనా చివరివరకూ క్రీజ్‌లో ఉండాలి. మిడిలార్డర్, లోయర్ ఆర్డర్‌లోని దూబె, అక్షర్, రింకు సింగ్ తమ బ్యాటింగ్‌కు పదును పెట్టాలి. స్వేచ్ఛగా ఆడితేనే పరుగులు వస్తాయి. వన్‌డౌన్‌లో వస్తోన్న తిలక్ వర్మ ఇంకాస్త స్ట్రయిక్ రేట్ పెంచాల్సిన అవసరం ఉంది. టీ20ల్లో 120లోపు స్ట్రైక్‌రేట్ ఉందంటే.. గొప్పగా ఆడినట్లేమీ కాదు. దానిని మార్చుకోవాలి. గత రెండు మ్యాచుల్లోనూ భారత్ ఒకేసారి రెండు, మూడు వికెట్లను కోల్పోవడం అలవాటుగా మార్చుకుంది. దాని నుంచి బయటపడాలి. టీ20 ప్రపంచ కప్‌నకు ముందు కివీస్‌తో ఆడిన సిరీస్‌లో భారత్ త్వరగా వికెట్లు కోల్పోయినా.. అలవోకగా 200+ స్కోరును చేయడం చూశాం. మరోసారి అదే ఆటతీరును ప్రదర్శిస్తే 'డిఫెండింగ్' ఛాంపియన్ ఖాతాలోనే మరో టైటిల్ పడటం ఖాయం. మన పిచ్‌లు, శ్రీలంక మైదానాలు ఒకేలా ఉండవు. అందుకే ఆ స్పిన్ ఫ్రెండ్లీ పిచ్‌లపై అవగాహన తెచ్చుకోవాలి. లేదంటే పాక్ మ్యాచ్‌లో ఇబ్బందులు తప్పవు.

**● ముందుంది అసలు కథ..**

గ్రూప్ స్టేజ్‌లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్ 8కి అర్హత సాధిస్తాయి. ఈ లెక్కన మన గ్రూప్ నుంచి భారత్, పాకిస్థాన్ వెళ్లడం దాదాపు ఖాయం. ఇక సూపర్ 8లో టీమ్‌ఇండియాకు కఠిన ప్రత్యర్థులే ఎదురవుతారు. ఆల్‌రౌండర్లతో కూడిన జట్టునే భారత్ ఎంపిక చేసింది. ఫైనల్ XIలోనూ అక్షర్, హార్దిక్, దూబె వంటి ఫినిషర్లనే తీసుకుంటోంది. రింకు సింగ్ అయితే ఈసారి పెద్దగా ప్రభావం పించలేకపోతున్నాడు. సూపర్ 8లోకి వచ్చాక ఆటతీరులో మార్పు చూపించకపోతే మాత్రం జట్టుతోపాటు ఆటగాళ్లకూ కష్టాలు తప్పవు.

# టీమ్‌ఇండియాకు ఆ సత్తా ఉంది: హర్భజన్ సింగ్

పొట్టి ప్రపంచకప్‌లో (ICC Mens T20 World Cup) భాగంగా.. ఆదివారం భారత్, పాకిస్థాన్ జట్ల మధ్య హైవోల్టేజ్ మ్యాచ్ జరగనుంది. ఈ పోరులో భారత్ విజయకేతనం ఎగురవేస్తుందని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ హర్భజన్‌సింగ్ అన్నాడు. రాంచీలో అతడు విలేకరులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశాడు. 'భారత్ మ్యాచ్‌ను కచ్చితంగా గెలుస్తుంది. పాకిస్థాన్ స్పిన్నర్ ఉస్మాన్ తారిక్‌ను భారత బ్యాటర్లు సమర్థంగా ఎదుర్కొంటారు. టీమ్‌ఇండియాకు ఆ సత్తా ఉంది. భారత్ చాలా మంచి జట్టు. నిత్యం ఆడుతున్నట్లే వారూ ఈ మ్యాచ్‌నూ ఆడతారు. ఒత్తిడి లేకుండా మెరుగైన ప్రదర్శన చేసి.. విజయ కేతనం ఎగుర వేస్తారు' అని హర్భజన్ సింగ్ అన్నాడు.

**——'పాకిస్థాన్ మీదే తీవ్రమైన ఒత్తిడి ఉంది'**

ప్రస్తుతం పాకిస్థాన్ మీదే తీవ్రమైన ఒత్తిడి ఉందని, ఈ మ్యాచ్ కచ్చితంగా భారత్ గెలుస్తుందని టీమ్‌ఇండియా మరో మాజీ క్రికెటర్ నయన్ మోంగియా అన్నాడు. 'ఈ మ్యాచ్‌లో కచ్చితంగా భారత్ విజయం సాధిస్తుంది. భారత్ బ్యాటింగ్, బౌలింగ్ చూసి ఆ విషయం చెప్పొచ్చు. పాకిస్థాన్ ఐసీసీ (ICC) టోర్నమెంట్లలో ఏడు లేదా ఎనిమిది మ్యాచుల్లో వరుసగా ఓడిపోయింది. నాకు తెలిసి భారత్‌కు మరోసారి పాక్‌ను ఓడించడం అంతకష్టం కాదు. పాకిస్థాన్ మీదే చాలా ఒత్తిడి ఉంది. ప్రస్తుతం క్రికెట్ బాగా మారింది. ముఖ్యంగా భారత యువ క్రికెటర్లు ఫియర్‌లెస్ క్రికెట్ ఆడుతున్నారు' అని అతడు విశ్లేషించాడు.



# ఆదుకొన్న బాంటన్.. స్కాట్లాండ్‌పై ఇంగ్లాండ్ విజయం

ఆరంభంలో కాస్త కంగారు పడినప్పటికీ స్కాట్లాండ్‌పై ఇంగ్లాండ్ ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన స్కాట్లాండ్ 19.4 ఓవర్లలో 152 పరుగులకు ఆలౌటైంది. అనంతరం లక్ష్య ఛేదనలో ఇంగ్లాండ్ 18.2 ఓవర్లలో ఐదు వికెట్లను కోల్పోయి 155 పరుగులు చేసింది. ఇంగ్లాండ్ ఆటగాడు బాంటన్ (63*) హాఫ్ సెంచరీ చేయగా.. జాకబ్ బెతెల్ (32), సామ్ కరన్ (28), విల్ జాక్స్ (16*) రాణించారు. స్కాట్లాండ్ బౌలర్లలో బ్రాండన్, బ్రాడ్, వీల్, లీస్క్, డేవిడ్‌సన్ తలో వికెట్ తీశారు.

